
ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

సోమవారం 28 ఏప్రిల్ 2025



ఉష్ణోగ్రత (అంచనా)

28-4-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	38	26
తెనాలి	38	26
నరసరావుపేట	39	25
బాపట్ల	36	27
రెంటచింతల	40	25

వరద పనులపై.. అలసత్వం



- మాన్‌సూన్‌యాక్షన్ ప్లాన్ శూన్యం
- వేసవి వచ్చినా పుర పాలకులు చోద్యం
- మున్సిపాల్టీల్లో పూడిపోయిన వరద నీటి కాల్వలు
- భారీ వర్షం కురిస్తే మున్సిపాల్టీలో కాలనీలు మునకే

పనులు.. ఇలా చేయాలి

మున్సిపాల్టీల్లో పూడిపోయిన కాల్వలను పునరుద్ధరించి వరద నీరు సులువుగా ప్రవహించే విధంగా చర్యలు చేపట్టాలి. ప్రధాన మురుగు కాల్వల్లో ప్రారంభం నుంచి చివరి వరకు పూడిక తీసి నీటి ప్రవాహానికి ఆటంకాలను తొలగించాలి. కాల్వల్లో పెరిగిన జమ్ము, నాచు తొలగించాలి. వర్షాకాల ముందస్తు పనులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి. ఇంజనీరింగ్, ప్రణాళికా, పారిశుధ్య విభాగాల అధికారులు కమిటీగా ఏర్పడి సమన్వయంతో ఆయా పనులు చేయాలి. కాల్వలపై ఉన్న ఆక్రమణలు తొలగించి నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా చర్యలు తీసుకోవాలి.

వర్షాలతో వరద.. ఇళ్లు మునకతో మున్సిపాల్టీల్లో ప్రజలు వణికిపోతున్నారు. ఓ మోస్తరు వర్షాలు కురిసినా ఆ నీరు పోయే మార్గాలు లేక ఎక్కడికక్కడ కాలనీలు మునిగిపోతున్నాయి. ప్రజలకు వరద కష్టాలు తప్పించేందుకు మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ అమలు చేయాల్సిన పుర పాలకులు చోద్యం చూస్తున్నారు. వర్షాలతో ముంపు సమయాల్లో హడావుడి చేయడానికే మున్సిపల్ అధికా రులు, పాలకులు ప్రాధాన్యం ఇస్తున్నారే కానీ ముందస్తు చర్యలపై శ్రద్ధ చూపడంలేదు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపల్ కేంద్రాల్లోని కాల్వలు జమ్ము, వ్యర్థాలు, తూటికాడలతో నిండి ఉంటున్నాయి. దీంతో ఓ మోస్తరు వర్షం పడినా ఆ నీరు పోయే మార్గాలు లేక లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతున్నాయి. రోజుల తరబడి ఆ ప్రాంతాల్లోని నివాసితులు నీటి మధ్య అల్లాడుతున్నారు. అదే వేసవిలో డ్రెయిన్లలో పూడిక తీస్తే వర్షపు నీరు సాఫీగా పారుదలై ప్రజలకు ముంపు కష్టాలు లేకుండా ఉంటాయి. అయితే వర్షాకాల ముందస్తు ప్రణాళిక, పనులపై అటు పాలకులు, ఇటు అధికారులు పట్టీపట్టనట్లుగా ఉంటున్నారు. వేసవిలో చేయాల్సిన పనులను వర్షాల సమయంలో చేస్తూ జేబులు నింపుకుంటున్నారన్న విమర్శలున్నాయి.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పురపాలక సంఘాల్లో మురుగు, వరదనీటి కాల్వలు పూడికతో నిండిపోయి.. ఓ వర్షాలకే పలు ప్రాంతాలు ముంపనకు గురవుతున్నాయి. దీంతో వర్షాలు వస్తున్నాయంటే ప్రజలు వణికిపోతున్నారు. వాస్తవానికి మురుగు కాల్వల్లో పూడిక తీత పనులు నిరంతరం కొనసాగిస్తుండాలి. ప్రస్తుత వేసవి కాలం పూడికతీత పనులకు అనువైన వాతావరణం. అయితే ఆయా పనులపై పురపాలకులు ప్రణాళికలతో ముందుకు వెళ్లడంలేదు. సమస్య వచ్చినపుడు మాత్రమే నిద్ర మేల్కొనడం అలవాటుగా మార్చుకున్నారన్న విమర్శలున్నాయి. వర్షాలు కురిసే ముందు హడావుడిగా పనులు చేపడుతున్నారు. దీని వల్ల ఫలితం లేకపోగా పాలకులు, కాంట్రాక్టర్లకు జేబులు నిండుతున్నాయి. వర్షాకాలంలో పనులు కంటికి కనిపించవు.. ఖర్చుల లెక్కతేలదు.. దీంతో నిధులు పక్కదారి పడుతున్నాయి. ప్రతి మున్సిపాల్టీలో వేసవి ప్రణాళికను అమలు చేయాలి. వర్షాకాలంలో ప్రజలకు మురుగు.. వరద నీటి ఇబ్బందులు లేని విధంగా ముందస్తుగా చర్యలు చేపట్టాలి.


వరద నీటి మునకలో నరసరావుపేట (పాత చిత్రం)

వర్షాలు కురవక ముందే పురపాలక సంఘాలలో ముంపు నివారణకు అవసరమైన పనులు పూర్తి చేయాలి. గతంలో ఏఏ ప్రాంతాలు వరదనీటితో ముంపుకు గురయ్యాయో గుర్తించి ఆయా ప్రాంతాల్లో కాల్వలను అభివృద్ధి చేయాలి. వర్షాలు కురిస్తే ఈ పనులు చేపట్టేందుకు వీలుండదు. ఇప్పటికైనా ముంపు నివారణలో భాగంగా కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలి. గత అనుభవాలను పరిశీలనలోకి తీసుకుని వరద నీరు గృహాల్లోకి ప్రవేశించకుండా పూర్తి స్థాయి చర్యలు చేపట్టాలి. ఈ దిశగా మున్సిపల్ అధికారులు స్పందించడం లేదు. వర్షాకాలం నాటికి పనులు పూర్తి చేసే విషయంలో పురపాలకులు మొద్దు నిద్ర వీడటం లేదు. జూన్ మొదటి వారంలో వర్షాలు కురుస్తుంటాయని తెలిసినా పురపాలకుల్లో చలనం లేదు. సదరు విభాగాల అధికారులు వరద నీటి కాల్వల్లో పూడిక తీత పనులు, పగిలిన కట్టడాల పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు ఇంకా సమాయత్తం కాకపోవటం గమనార్హం. వరదల సమయంలో ముంపునకు గురయ్యే గృహాల వారికి సాయం అందించే కన్నా ముందస్తు చర్యలు తీసుకోవడం మిన్న అనే అంశాన్ని అధికారులు విస్మరిస్తున్నారు. దీంతో పట్టణ ప్రాంతాల్లో ఏటా ముంపు ప్రాంతాల్లోని ప్రజలు వరద కష్టాలను ఎదుర్కొంటు న్నారు. ఈ ఏడాదైనా ప్రజలను ముంపు కష్టాల నుంచి గట్టెక్కించేందుకు ఇప్పటికైనా వర్షాకాలం ముందస్తు పనులు చేప ట్టే అంశంపై ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.

మొక్కుబడిగా మమ

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు వర్షాకాల ముందస్తు ప్రణాళికను పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పురపాలక సంఘాల్లో చిన్న, పెద్ద కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలని భావించింది. గత జూలైలో పూడిక తీతకు నిధులు మంజూరు చేసింది. కొన్ని మున్సిపాల్టీల్లో ఈ పనులు మొక్కుబడిగా నిర్వహించారు. మరి కొన్ని మున్సిపాల్టీలు మమ అనిపించాయి. కేవలం నిధులు ఖర్చు చూపించాలన్న ఉద్దేశంతోనే పనులు చేపట్టారే కానీ ముంపు సమస్య పరిష్కరించాలన్న ఉద్దేశం లేదన్న విమర్శలు వచ్చాయి.


నరసరావుపేటలో జమ్ము, వ్యర్థాలతో పూడి పోయిన ప్రధాన వరద నీటి కాల్వలు

కబ్జాలో కాల్వలు

జిల్లా కేంద్రాలైన గుంటూరు, నరసరావుపేట, బాపట్లతోపాటు మూడు జిల్లాల పరిధిలోని మున్సిపల్ పట్టణాల్లో వరద నీటి కాల్వలు చాలావరకు ఆక్రమణల పాలయ్యాయి. కాల్వలపైనే కొందరు నిర్మాణాలు చేపట్టారు. పూడిక తీయడానికి వీలు లేకుండా కబ్జా చేసేశారు. కాల్వలపై ఆక్రమణలతో వర్షపు నీరు పోయే మార్గాలు లేకపోయినా వాటి తొలగింపునకు కనీస ప్రయత్నాలు జరగడంలేదు. మున్సిపల్ రికార్డుల్లో నమోదైన ప్రకారం కాల్వల విస్తీర్ణం లేదు. కాల్వలను మాయం చేసేలా నిర్మాణాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో భారీ వర్షాలు కురిస్తే రోడ్లు చెరువులను మరిపిస్తున్నాయి. పల్లపు ప్రాంతాల్లోని గృహాలు ముంపునకు గురవుతున్నాయి.

నేడు మేయర్ ఎన్నిక

కోవెలమూడి ఎన్నిక లాంఛనమే

- కూటమి అభ్యర్థిగా నాని నామినేషన్
- అరగంటలో పూర్తికానున్న ఎన్నిక ప్రక్రియ
- ప్రిసైడింగ్ అధికారి భార్గవ్‌తేజ ఏర్పాట్ల పరిశీలన

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పాలక సంస్థ మేయర్ ఎన్నిక సోమవారం జరగనున్నది. నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో ఎన్నిక ప్రక్రియకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా ఏర్పాట్లను ఆదివారం ప్రి సైడింగ్ అధికారిగా నియమితులైన జేసీ భార్గవ్ తేజ ప్రత్యేకంగా పరిశీలించారు. అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఇక కూటమి అభ్యర్థిగా 37వ డివిజన్ కార్పొరేటర్, ఫ్లోర్ లీడర్ కోవెలమూడి రవీంద్ర(నాని) ఆదివారం నామినేషన్ దాఖలు చేశారు. కౌన్సిల్‌లో కూటమి బలాన్ని పరిశీలిస్తే ఆయన ఎన్నిక లాంఛనమేనని తెలుస్తోంది. 2021 మార్చిలో నగర పాలక సంస్థ ఎన్నికల్లో వైసీపీ తరపున కావటి మనోహర్ నాయుడు మేయర్‌గా ఎన్నికయ్యారు. గత ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల అనంతరం వైసీపీ కార్పొరేటర్లు 19 మంది టీడీపీ, జనసేన పార్టీల్లో చేరారు. దీంతో కౌన్సిల్‌లో వైసీపీ పూర్తిగా బలహీన పడిపోయింది. ఇటీవల స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఆరుగురుకి ఆరుగురు సభ్యులు కూటమి పార్టీలవారే గెలుపొందారు. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో గత నెల 15న ఆయన మేయర్ పదవికి రాజీనామా చేశారు. దీంతో మేయర్ స్థానానికి ఎన్నిక అనివార్యమైంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో సోమవారం మేయర్ ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో కూటమి పార్టీల తరపున మేయర్ అభ్యర్థిగా కోవెలమూడి రవీంద్ర, వైసీపీ తరపున 30వ డివిజన్ కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి పోటీలో నిలిచారు. అయితే ఈ పోటీలో కూటమికి 34 మంది సభ్యుల మెజారిటీ ఉండడంతో కోవెలమూడి రవీంద్ర ఎన్నిక లాంఛనంగా మారింది. ఆయన ఎన్నిక అరగంటలో పూర్తవడం, ఆ వెనువెంటనే 7వ మేయర్‌గా నాని బాధ్యతలు చేపట్టనున్నట్లు కూటమి నేతలు చెబుతున్నారు.


జేసీ భార్గవతేజకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న నాని, పక్కన ఎమ్మెల్యే మాధవి, డేగల, గాదె

విప్ జారీ చేసిన వైసీపీ, కూటమి

మేయర్ ఎన్నికకు సంబంధించి కార్పొరేటర్లను కట్టడి చేసేందుకు అటు కూటమి, ఇటు వైసీపీ నేతలు రంగంలోకి దిగారు. తమ పార్టీ తరపున బరిలో నిలిచిన అభ్యర్థులను గెలిపించుకునేందుకు వైసీపీ, కూటమి పార్టీల నేతలు పార్టీల పరంగా విప్ జారీ చేశారు. విప్‌లు జారీ చేసిన నేపథ్యంలో ఆయా పత్రాలను ప్రిసైడింగ్ అధికారికి ఆయా నేతలు కలెక్టరేట్‌లో అందజేశారు. మేయర్ అభ్యర్థిగా కోవెలమూడి రవీంద్రని ప్రతిపాదిస్తూ అధిష్ఠానం ఇచ్చిన ఫారం-బీని టీడీపీ నేతలు అందజేశారు. కలెక్టరేట్‌లో జేసీ భార్గవ తేజకు ఆదివారం నాని నామినేషన్ పత్రాలను అందజేశారు. నగర పాలక సంస్థలో జరిగే ఎన్నికలో కార్పొరేటర్లు అందరూ తనకు సహకరించాలని నాని కోరారు. స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఫలితాలే మేయర్ ఎన్నికలోనూ పునరావృతం అవుతాయని చెప్పారు. వైసీపీ విప్‌గా 29వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రోషన్‌ను నియమించారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు జారీ చేయగా ఆ పత్రాలను కలెక్టరేట్‌లో అందజేశారు. సోమవారం ఉదయం వైసీపీ మేయర్ అభ్యర్థిగా అచ్చాల వెంకటరెడ్డి నామినేషన్ వేయనున్నట్లు రోషన్ ప్రకటించారు.


సిద్ధమైన మేయర్ ఎన్నిక జరిగే ఛాంబర్

గుర్తింపు కార్డులతోనే ప్రవేశం

కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు జరిగే మేయర్ ఎన్నికకు సంబంధించి కౌన్సిల్ సభ్యులు, ఎక్స్ అఫిషియో సభ్యులు ఉదయం 10:30 గంటలకు గుర్తింపు కార్డులతో హాజరు కావాలని ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి భార్గవతేజ తెలిపారు. సభ్యుల మొబైల్ ఫోన్లకు అనుమతి కూడా లేదన్నారు. మేయర్ ఎన్నిక సమావేశానికి సభ్యులు మినహా ఇతరులు ఎవరినీ అనుమతించేది లేదన్నారు. జీఎంసీ ప్రధాన కార్యాలయ పరిసరాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

కదల్లేని వారికి కార్డులెలా?



సీనియర్ సిటిజన్ కార్డు

- వృద్ధులకు సీనియర్ సిటిజన్ కార్డుల కష్టాలు
- సచివాలయాలకు వెళ్తేనే ప్రాసెసింగ్ చేస్తున్న సిబ్బంది
- ఇంటి వద్దనే కార్డు మంజూరు చేయాలంటున్న వృద్ధులు

గుంటూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న సీనియర్ సిటిజన్ కార్డులను పొందలేని పరిస్థితి పలువురు వృద్ధుల్లో నెలకొన్నది. కార్డు కోసం సచివాలయాలకు వెళ్లాల్సి రావడమే ఇందుకు కారణం. వృద్ధుల్లో కొందరు అనారోగ్య సమస్యల దృష్ట్యా నడవలేని వాళ్లు ఉన్నారు. వారు కార్డు కోసం సచివాలయానికి వెళ్లి అక్కడ దరఖాస్తు చేసుకోవాలంటే చాలా ఇబ్బందికరంగా మారింది. అసలే ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 10 గంటల సమయం దాటిన తర్వాత వృద్ధులు ఇంటి నుంచి అడుగు బయటకు పెట్టలేని పరిస్థితి. ఒకవేళ ఎక్కడికైనా బయటకు వెళ్లి వస్తే వడదెబ్బ బారిన పడుతు న్నారు. గుంటూరు జిల్లాలో 85 ఏళ్ల వయస్సు పైబడి వృద్ధులు దాదాపుగా 17 వేల మంది ఉన్నారు. ఇక బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోనూ వేల సంఖ్యలో వృద్ధులు ఉన్నారు. గ్రామాలు, కొన్ని పట్టణాల్లో సుదూరంగా సచివాలయాలు ఉన్నాయి. అక్కడ వరకు ఎండల్లో వెళ్లలేక.. కార్డులు పొందలేక వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని సచివాలయాల్లో ఉదయం 11 గంటల వరకు సిబ్బంది రావడంలేదు.. ఆ తర్వాత కూడా రకరకాల పనులు, ఫోన్లలో బిజీగా ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో వృద్ధులు ఎండలో అంతదూరం వెళ్లలేక.. వెళ్లినా గంటల తరబడి నిరీక్షించలేక పోతున్నారు.ఈ పరిస్థితుల్లో సచివాలయాలకు వెళ్లి సీనియర్ సిటిజన్ కార్డులు పొందాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ/వార్డు సచివాలయాల్లో సీనియర్ సిటిజన్ కార్డులను సిబ్బంది మంజూరు చేస్తున్నారు. ఎవరైతే 60 ఏళ్ల వయస్సు దాటిన వృద్ధులు ఆధార్ జిరాక్స్, పాసుపోర్టు సైజు ఫొటో, బ్లడ్ గ్రూపు, ఆధార్ లింక్ మొబైల్ నంబరు తీసుకుని వచ్చిన వారికి దరఖాస్తు ఇచ్చి దానిని పూర్తి చేయించి సచివాలయాల సిబ్బంది ప్రాసెసింగ్ చేస్తున్నారు. దాంతో ఆన్‌లైన్‌లో ప్రభుత్వ లోగోతో సీనియర్ సిటిజన్ కార్డు మంజూరు అవుతున్నది. ఆ కార్డులో వృద్ధుడు/వృద్ధురాలి పేరు, పుట్టిన తేదీ, మాస్క్‌డ్ ఆధార్ నంబరు, సీనియర్ సిటిజన్ కార్డు నంబరు, బార్ కోడ్, చిరునామా, కాంటాక్టు నంబరు, అత్యవసరమైతే సంప్రదించాల్సిన వ్యక్తి పేరు, మొబైలు నంబరు, ఎమర్జన్సీ నంబర్లు పొందుపరిచి ఉంటున్నాయి. ఈ సీనియర్ సిటిజన్ కార్డులు పలు విధాలుగా వృద్ధులకు ఉపయోగపడతాయని అధికారులు చెబుతున్నారు.

కార్డుతో పలు ప్రయోజనాలు..

సీనియర్ సిటిజన్ కార్డులతో బహుళ ప్రయోజనాలున్నాయి. వృద్ధాప్య పింఛన్ పొందాలంటే ఈ కార్డు ఉంటే సరిపోతుంది. ఇందుకు కారణంగా ఈ కార్డులోనే పుట్టిన తేదీ నమోదై ఉంటుంది. అలానే ఆధార్ నంబరు కూడా ఉంటుంది. మిగతా ప్రభుత్వ పథకాలకు లబ్ధి పొందాలన్నా ఉపయోగకరంగా ఉంటుంది. ఆర్టీసీ బస్సు ప్రయాణాల్లో సీనియర్ సిటిజన్ కార్డు చూపించి టిక్కెట్ చార్జీలో రాయితీ పొందవచ్చు. బ్యాంకుల్లో వృద్ధులకు ప్రత్యేకించి అధిక వడ్డీ చెల్లించే డిపాజిట్ల స్కీమ్‌లకి కూడా ఈ కార్డు ఉపయోగపడుతుంది. ఆస్పత్రుల్లోనూ సీనియర్ సిటిజన్ కార్డు ఉపయోగపడుతుంది. రైల్వే టిక్కెట్ కౌంటర్లలో త్వరితగతిన టిక్కెట్లు బుకింగ్ చేసుకోవచ్చు. ఈ ఉపయోగాల దృష్ట్యా సీనియర్ సిటిజన్ కార్డుకు డిమాండ్ పెరుగుతుంది. ఈ పరిస్థితుల్లో ఇళ్ల వద్దనే పింఛన్‌ను పంపిణీ చేస్తున్నట్లుగా సీనియర్ సిటిజన్ కార్డులు పంపిణీ చేయాలని వృద్ధులు కోరుతున్నారు.

కల్తీ ఆయిల్ వ్యాపారం.. వైసీపీ నేతపై కేసు నమోదు 6

14 పైలట్ గ్రామాల్లో రీ సర్వే

జూన్ 27 గడువుగా నిర్ణయించిన ప్రభుత్వం • ఇంకా 9 ప్రక్రియలు పూర్తయితేనే రీసర్వే సంపూర్ణం

గుంటూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం చేసిన భూముల రీసర్వేని అర్ధంతరంగా నిలిపేసిన టీడీపీ ప్రభుత్వం మళ్లీ జిల్లాలో 14 పైలట్ గ్రామాల్లో ఆ ప్రక్రియని ప్రారంభించింది. ఇందుకోసం గుంటూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 8, తెనాలిలో ఆరు గ్రామాలను ఎంపిక చేసి రీసర్వే కొనసాగిస్తున్నది. జూన్ 27 వరకు ప్రభుత్వం గడువు నిర్ణయించింది. అయితే ఇప్పటివరకు గ్రౌండ్ ట్రూతింగ్, ఎపీఎం వెక్టొరైజేషన్ ప్రక్రియలను మాత్రమే పూర్తి చేశారు. ఒక పక్క ఎండ తీవ్రత, మరోవైపు అమరావతి రాజధానిలో పనుల కారణంగా అధికారులు రీసర్వేపై ప్రత్యేకంగా దృష్టి పెట్టలేకపోతున్నారు. దీంతో ప్రభుత్వం నిర్దేశించిన గడువు తేదీ లోపు రీసర్వే పూర్తి చేయడం సాధ్యమయ్యేలా లేదు. భూముల రీసర్వేలో భాగంగా ప్రత్తిపాడు మండలం మల్లాయపాలెం (3608.70 ఎకరాలు), పెదకాకానిలో అనుమర్లపూడి(816.18), గుంటూరు తూర్పులో జొన్నలగడ్డ(2263.68), మేడికొండూరులో మందపాడు (1955.70), తాడికొండలో లచ్చన్నగుడిపూడి (1596.80), తుళ్లూరులో వడ్డమాను (1936.90), ఫిరంగిపురంలో నుదురుపాడు (2770.32), గుంటూరు పశ్చిమలో చినపలకలూరు (2574.93), చేబ్రోలులో మంచాల(783.15), పొన్నూరులో వల్లభరావుపాలెం(4240.18), తెనాలిలో పెదరావూరు(2153.93), కాకుమానులో పాండ్రపాడు(823.75), కొల్లిపరలో కుంచవరం (356.64), దుగ్గిరాల మండలంలో పెరుకలపూడి (1422.05 ఎకరాలు) గ్రామాలను ఎంపిక చేశారు. ఈ గ్రామాల్లో మొత్తం 27 వేల 302.91 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించి రీసర్వే చేస్తున్నారు. అయితే ఇప్పటివరకు గ్రౌండ్ ట్రూతింగ్, ఎల్‌పీఎం వెక్టొరైజేషన్ ప్రక్రియలు మాత్రమే పూర్తి చేశారు. ఇంకా 9 ప్రక్రియలు పూర్తి అయితేనే రీసర్వే సంపూర్ణమవుతుంది. కాగా రీసర్వే కోసం 14 గ్రామాలకు 63 బృందాలను ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయి భూమి రికార్డుల స్వచ్ఛీకరణ (ఎఫ్‌పీవోఎల్ఆర్) 4866 ఎకరాల్లో మాత్రమే పూర్తి చేశారు. 2403 మ్యుటేషన్లకు 1637 ఆన్‌లైన్‌లో నివేదించారు. 1623 మ్యుటేషన్ల ప్రక్రియని పూర్తి చేశారు. పెదరావూరులో 41 మ్యుటేషన్లను ఆన్‌లైన్‌లో చేర్చలేదు. ఇందుకు కారణం మొత్తం సర్వే నంబర్లలో ఉన్న భూమి విస్తీర్ణం, పట్టాదారుల భూమి విస్తీర్ణంతో సరిపోకపోవడమే. ఈ విధంగా క్షేత్రస్థాయిలో సమస్యలు ఉత్పన్నమౌతుండటంతో ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపు రీసర్వే కష్టమన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది.


రీసర్వే మ్యాప్

చదువుతోనే అసమానతలు లేని సమాజం

● యూపీఎస్సీ 146 ర్యాంకర్ చల్లా పవన్‌కల్యాణ్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చదువుతో అసమానతలు లేని సమాజాన్ని నిర్మించవచ్చని యూపీఎస్సీలో 146 ర్యాంకు సాధించిన చల్లా పవన్ కల్యాణ్ అన్నారు. ఆదివారం గుంటూరులోని బృందావన్‌గార్డెన్స్‌లో కమ్మజన సేవా సమితి ఆయనను ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమానికి సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ చదువుతో పాటు నైపుణ్యాన్ని మెరుగుపరుచు కోవాలని సూచించారు.



చల్లా పవన్‌కల్యాణ్‌ను సత్కరిస్తున్న కమ్మజన సేవా సమితి సభ్యులు

కష్టపడి గాకుండా ఇష్టపడి చదవాలని అప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పవన్ కల్యాణ్ తండ్రి రమేష్ మాట్లాడుతూ తమది మధ్యతరగతి కుటుంబమని, పట్టుదలతో చదివి ఈ స్థాయికు తన కొడుకు చేరుకున్నాడని సంతోషం వ్యక్తం చేశారు. కుమార్తె సుచరిత కూడా చదరంగంలో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తోందని తెలిపారు. సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ ఐఏఎస్, ఐపీఎస్‌లే దేశాన్ని నడిపిస్తున్నారని అటువంటి కీలక బాధ్యతలు తీసుకుంటున్న పవన్‌కల్యాణ్‌ను అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రవాసాంధ్రులు కోటా వంశీ, సమితి గౌరవ సలహాదారు కన్నెగంటి బుచ్చయ్య చౌదరి కల్యాణ్ కృషిని కొనియాడారు. అనంతరం చల్లా పవన్ కల్యాణ్, తల్లిదండ్రులను పాలకవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వడ్లమూడి నాగేంద్రం, గోరంట్ల పున్నయ్య చౌదరి, గుంటుపల్లి కోటేశ్వరరావు, మర్రిపూడి సీతారామయ్య, పెద్ది సాంబశివరావు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

❖ ఒకరు మృతి, మరొకరి పరిస్థితి విషమం



విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తాపడిన కారు

బాపట్లరూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో కారుని వేగంగా నడపడంతో.. అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల మేరకు.. బాపట్ల మండలం రామ్‌నగర్‌కు చెందిన దండప్రోలు కృపాకర్ (30), బాపట్ల పట్టణానికి చెందిన అశోక్ అనే ఇద్దరు మద్యం సేవించారు. కృపాకర్‌ను రామ్‌నగర్‌లో దించేందుకు ఇద్దరూ కారులో వెళ్తుండగా ముత్తాయపాలెం గ్రామ సమీప మలుపు వద్ద కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ఘటనలో కృపాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు బాపట్ల ఏరియా వైద్యశాలకు తీవ్రగాయాల పాలైన అశోక్‌ను తరలించారు. కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం చీరాలలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి కూడా విషమంగా ఉంది. బాపట్లరూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



హరిలో రంగ హరి నాటికలోని ఓ సన్నివేశం




ఉక్కు సంకెళ్లు నాటికలోని ఓ సన్నివేశం

ప్రేక్షకులను అబ్బురపరిచిన నాటికలు

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పరుచూరి రఘుబాబు స్మారక 35వ జాతీయ స్థాయి నాటకోత్సవాలు ప్రేక్షకులను అబ్బురపరిచాయి. మండల పరిధిలోని పల్లెకోనలో ఆదివారం పరుచూరి రఘుబాబు మెమోరియల్ ఆధ్వర్యంలో నాటకోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. వెలగలేరు థియేటర్స్ ఆధ్వర్యంలో హరిలో రంగహరి నాటకాన్ని తొలుత ప్రదర్శించారు. సమాజంలో అందరి జీవితాలు ఒకేలా ఉండవు. ఒకరి ఇష్టాలు ఇంకొకరి పిచ్చిలా, చాదస్తంగా అనిపిస్తాయని.. ప్రస్తుత కాలంలో సాంప్రదాయాలను గౌరవిస్తూ ఆదరించే వారిని అదో రకంగా చూడడం మామూలు అయిపోయిందని, తాత తండ్రుల నుండి వంశపారంపర్యంగా వస్తున్న హరిదాసు వృత్తిని కొనసాగించాలని కోటేష్ అనే వ్యక్తి ఎదురైన అడ్డంకులు, అవమానాలు తట్టుకుని ఎలా అధిగమించాడనే ఇతివృత్తంతో ఈ నాటిక కొనసాగింది. పూలదాసు శ్రీనివాసరావు దర్శకత్వంలో నటీనటులు సురభి రాఘవ, సాయిదీపిక, ఫరూక్, స్వరూప్ మిరియాల, పవన్‌కల్యాణ్, శ్రీనివాసరావు, కొండలరావు, సురభి లలిత, గట్టు రవి తదితరులు పోషించిన పాత్రలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. రెండవది ఉక్కు సంకెళ్లు నాటిక ప్రదర్శించారు. మత్స్యకారుల చేపల వేట వృత్తాంతంతో సాగిన ఈ నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. ఉప్పులూరి సుబ్బరాయ శర్మ దర్శకత్వంలో సింహప్రసాద్ రచించారు. అనంతరం కావూరి సత్యనారాయణ రచించగా ఈపూరి హరిబాబు దర్శకత్వంలో చిరు మేఘం నాటిక ప్రదర్శించారు. ఈ మూడు నాటికలు ప్రేక్షకులను ఆలోచింపజేశాయి.

రెండు పళ్ల విభాగంలో.. బయ్యారం ఎడ్లజత విజయం



బండ లాగుతున్న ఎడ్ల జత

దాచేపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు రెండవ రోజు ఉత్సాహంగా జరిగాయి. జత పళ్ల విభాగంలో 3,553.05 అడుగుల దూరం లాగి పల్నాడు జిల్లా బయ్యారం గ్రామానికి చెందిన కేఎంకే బుల్స్ మణికంఠ ఎడ్ల జత మొదటి స్థానంలో నిలిచింది. రెండవ స్థానంలో 3,500 అడుగుల దూరం లాగి ప్రకాశం జిల్లా బసినేపల్లి గ్రామానికి చెందిన ఎడ్లకంట్ల వెంకట చైతన్య కుమార్ ఎడ్ల జత, మూడవ స్థానంలో 3,324.05 అడుగులు దూరం లాగి కడప జిల్లా పాలూరు గ్రామం హేమలత బుల్స్ కొణిదల హేమలతారెడ్డి ఎడ్ల జత, నాల్గవ స్థానంలో 3,278.4 అడుగుల దూరం లాగి పల్నాడు జిల్లా అబ్బూరు గ్రామానికి నక్కా బల రామకృష్ణ యాదవ్, మాచాయపాలెం గౌరు కార్తికేయ కంబైన్డ్ ఎడ్ల జతలు, ఐదవ స్థానంలో 3,235.06 అడుగులు దూరం లాగి పల్నాడు జిల్లా దాచేపల్లి గ్రామానికి చెందిన కేకేఆర్ బుల్స్ కల్లూరి కార్తీక నాయుడు, భార్గవ్ నాయుడు ఎడ్ల జత, 6వ స్థానంలో 3,195 అడుగుల దూరాన్ని లాగి సూర్యపేట జిల్లా మేళ్ళచెరువు గ్రామం కేకేఆర్ బుల్స్ కొప్పుల గోవర్ధన్‌రెడ్డి, రెవెల్యూష్ రెడ్డి ఎడ్ల జతలు నిలిచాయి. మొదటి బహుమతికి రూ.20వేలు నగదు బచ్చు జనార్దన్ జ్ఞాపకార్థం బచ్చు సుధీర్, రెండవ బహుమతి రూ.15వేలు రుద్రాల అచ్చారావు, మునిని శ్రీను, బొడ్డపాటి రామకృష్ణ, మూడవ బహుమతి రూ.10వేలు కె.వెంకటేశ్వరరెడ్డి జ్ఞాపకార్థం విష్ణు మూర్తి, అనంత కోటేశ్వరరావు, నాల్గవ బహుమతి రూ.8వేలు కమతం శ్రీనివాసరావు, 5వ బహుమతి రూ.6వేలు ఏఎంఆర్ ఎలక్ట్రికల్స్ ఆశం అచ్చిరెడ్డి, 6వ బహుమతి రూ.5వేలు గుదె నిహారిక, నగదుతో పాటు షీల్డ్ ప్రదానం చేశారు.

కల్తీ ఆయిల్ వ్యాపారం.. వైసీపీ నేతపై కేసు నమోదు



ఆయిల్ కల్తీకి స్థావరమైన మిల్లు (ఇన్‌సెట్లో) చీదెళ్ల కృష్ణ, వైసీపీ నాయకుడు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్లకు చెందిన వైసీపీ నాయకుడు చీదెళ్ల కృష్ణపై నెల్లూరు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పిడుగురాళ్ల - మాచర్ల రహదారి పక్కనే ఉన్న నూనె మిల్లులో రాష్ట్రంలోని ప్రముఖ బ్రాండ్ల పేరుతో కల్తీ ఆయిల్ తయారు చేసి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నాడన్న అతనిపై ఫిర్యాదులు ఉన్నాయి. ఈ క్రమంలో నెల్లూరులోని ఓ కంపెనీ నుండి 15 టన్నుల ఆయిల్ ట్యాంకర్ బెంగుళూరుకు కొన్ని రోజుల వరకు వెళ్లకపోవడంపై కంపెనీ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. లారీ డ్రైవర్ ఆయిల్ ట్యాంకర్ ప్రమాదానికి గురై ఆయిల్ అంతా కిందపోయిందని కట్టుకథలకు పోలీసులు తనదైన శైలిలో విచారించగా పిడుగురాళ్లకు చెందిన చీదెళ్ల కృష్ణతో కలిసి కల్తీ వ్యాపారానికి సహకరించినట్లు విచారణలో తేలింది. దీంతో నెల్లూరు పోలీసులు శుక్రవారం రాత్రి పిడుగురాళ్ల సమీపంలో చీదెళ్ల కృష్ణకు చెందిన ఆయిల్ మిల్లులో సోదాలు నిర్వహించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనను అడ్డుపెట్టుకొని అతను కల్తీ నూనె వ్యాపారం పెద్ద ఎత్తున సాగించాడు. ప్రతినెలా పలుశాఖల అధికారులకు మామూళ్లు ముట్టజెప్పి, వైసీపీ నాయకులతో సిఫార్సు చేయించుకోవడంతో సంబంధిత అధికారులు కల్తీ వ్యాపారం వైపు కన్నెత్తి కూడా చూడలేదు. నెల్లూరు నుండి బెంగుళూరుకు వెళ్లాల్సిన ఆయిల్ ట్యాంకర్‌ను దారిమళ్లించి ఆయిల్‌ను చోరీ చేసిన ఘటనలో చీదెళ్ల కృష్ణ, రవిపై అక్కడి పోలీసులు కేసు నమోదు చేయడంతో పిడుగురాళ్లలో వైసీపీ నేతలు ఉలికిపాటుకు గురయ్యారు. విచారణలో ముడుపులు తీసుకున్నట్లుగా తమ పేర్లు ఎక్కడ బయటకు వస్తాయోనని అధికార పార్టీ నేతలు భయపడుతున్నారు. వైసీపీ హయాంలో పిడుగురాళ్ల మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా చీదెళ్ల కృష్ణ సతీమణి రేవతి పనిచేశారు.

ఉగ్రదాడిలో అమరులకు రైల్వే స్కౌట్స్, గైడ్స్ ఘన నివాళి

● కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న డీఆర్ఎం సుధేష్ణ సేన్



కొవ్వొత్తుల ర్యాలీలో డీఆర్ఎం సుధేష్ణ సేన్, ఏడీఆర్ఎం, అధికారులు

గుంటూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని బైసరన్ లోయలో జరిగిన ఉగ్రదాడిలో చనిపోయిన దేశ పౌరులకు గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుధేష్ణ సేన్ ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం సాయంత్రం దక్షిణ మధ్య రైల్వే భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఉగ్రదాడిని నిరసిస్తూ పోలీసు పరేడ్ గ్రౌండ్స్ నుంచి గుంటూరు రైల్వే స్టేషన్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ నినాదాలు చేశారు. ర్యాలీ ముగింపు కార్యక్రమం సందర్భంగా రైల్వేస్టేషన్‌లో అమరులకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులు వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం కె.సైమన్, సీనియర్ డీపీవో షాబాజ్ హనూర్, సీనియర్ డీఎంఈ మద్దాళి రవికిరణ్, డీసీఎం కమలాకర్‌బాబు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

పిడుగురాళ్ల ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లెనిన్ నగర్‌లో ఉంటున్న ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఆదివారం పిడు గురాళ్ల పోలీసులు తెలిపారు. వివరాల మేరకు.. చల్లా అనిల్ కుమార్ అదే ప్రాంతానికి కృష్ణా జిల్లా నుంచి వచ్చి నివాసం ఉంటున్న తల్లికూతుర్లతో పరిచయం పెంచుకున్నాడు. మహిళ పట్టణ పరిధిలో ఓ రెస్టారెంట్‌లో పనికి వెళ్తోంది. ఇంటిలో ఒంటరిగా ఉంటున్న ఆమె 17 ఏళ్ల కూతురుతో కొన్నాళ్లుగా అనిల్‌కుమార్ చనువుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో కూతురు ఆరోగ్యంలో మార్పులు గమనించిన తల్లి ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్ష చేయించగా గర్భవతి అని తేలింది. దీంతో అనిల్ కుమార్‌పై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

● ముగ్గురూ ఉమ్మడి గుంటూరు జిల్లా వాసులే.. ● రూ.40లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలు స్వాధీనం



అమలాపురంలో వివరాలు వెల్లడిస్తున్న ఆ జిల్లా ఎస్పీ కృష్ణారావు

అమలాపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గత మూడేళ్లలో వివిధ ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడ్డ ముగ్గురితో కూడిన అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణ పరిధిలో కురసాల వారి వీధిలో 2 ప్రాంతాల్లోను, గాంధీనగర్‌లో ఒకచోట దొంగతనాలకు పాల్పడ్డ ఈ ముఠా నుంచి రూ.40లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా సభ్యులపై వివిధ జిల్లాల్లో మొత్తం 17 కేసులు ఉన్నాయి. ఈ విషయాలను అమలాపురంలోని ఎస్పీ కార్యాలయ కాన్ఫరెన్సు హాలులో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు వెల్లడించారు. జనవరి 11న అమలాపురంలోని కురసాలవారి వీధిలోని ఒక ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు బీరువాలోని బంగారం, నగదు దొంగిలించుకుపోయారు. అప్పట్లో పట్టణ పోలీసుస్టేషన్‌లో నమోదైన ఈ కేసుకు సంబంధించి పల్నాడు జిల్లా నర్సారావుపేట మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన జంగా వెంకట్రావు, అదే జిల్లాలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన దమ్ము సుధాకర్, గుంటూరు అర్బన్ జిల్లా శ్రీరామ్‌నగర్‌కు చెందిన కాట్ల కిశోర్‌బాబు నర్సాపురంలో ఆభరణాలు విక్రయిస్తుండగా ఆదివారం అరెస్టు చేసినట్టు ఎస్పీ తెలిపారు. వారి నుంచి 400 గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండి, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురు సభ్యుల ముఠా గతంలో కోనసీమలోని రావులపాలెం పోలీసుస్టేషన్‌లో 1, అమలాపురం టౌన్ పోలీసుస్టేషన్‌లో 1, తూర్పుగోదావరిలో 2, ఏలూరులో 3, గుడివాడలో 1, నంద్యాల 2, కడప 1, కర్నూలు 1, అనంతపురం 1, పశ్చిమగోదావరి 1, అన్నమయ్య జిల్లా 1 కేసుల్లో గతంలోనే నిందితులుగా ఉన్నారు. అలాగే మిర్యాలగూడాలో 15 కేసుల్లో, నంద్యాల జిల్లాలో 2 కేసుల్లోను ఇప్పటికే వారు అరెస్టు అయినట్టు ఎస్పీ చెప్పారు. ఈ ముగ్గురి నుంచి సుమారు రూ.40లక్షలు విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. విలేకర్ల సమావేశంలో అడ్మిన్ ఎస్పీ ప్రసాద్, డీఎస్పీ ప్రసాద్‌లు పాల్గొన్నారు. ఈ కేసు చేదించడంలో కీలకంగా పనిచేసిన సీఐలు వీరబాబు, గజేంద్ర ఎస్ఐ కిశోర్‌బాబు, క్రైమ్ ఏఎస్ఐ అయితాబత్తుల బాలకృష్ణ, పోలీసులకు ఎస్పీ రివార్డు, ప్రశంసాపత్రాలు అందించి, అభినందించారు.

తెలంగాణ నూతన సీఎస్ ఒకప్పటి గుంటూరు కలెక్టరే



కే రామకృష్ణారావు

గుంటూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నూతన చీఫ్ సెక్రెటరీగా నియమితులైన కె.రామకృష్ణారావు గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు కలెక్టర్ గా విధులు నిర్వహించారు. 1991 ఐఏఎస్ బ్యాచ్ అధికారి అయిన రామకృష్ణా రావు 2004కి ముందు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. ఆయన కలెక్టర్‌గా ఉన్నప్పుడే సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో తొలిసారిగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను ప్రవేశపెట్టారు. ఎన్నికల యంత్రాంగాన్ని సమాయత్తం చేసి ఎక్కడా రీపోలింగ్‌కు ఆస్కారం లేకుండా ఎన్నికలను నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సమయంలో ఆయన తెలంగాణ క్యాడర్‌కు వెళ్లిపోయారు. ఇప్పుడు ఆ రాష్ట్రానికి సీఎస్ కావడంతో అప్పట్లో జిల్లాలో విధులు నిర్వహించిన అధికారులు, ఉద్యోగులు ఆయనతో కలిసి పని చేసిన రోజులను జ్ఞాపకం చేసుకొంటున్నారు.

పట్టాలపైకి పశువులను తీసుకురావొద్దు

● యజమానులకు రైల్వే రక్షక దళం విజ్ఞప్తి

గుంటూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పశువులను రైలు పట్టాల మీదకు తీసుకొచ్చి ప్రయాణికుల భద్రతకు హాని తలపెట్టొద్దని రైల్వే రక్షక దళం, ఇంజనీరింగ్ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని నడికుడి మార్గంలో పలుచోట్ల అవగాహన కార్యక్రమాలను నిర్వహించి, పశువుల యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే



నడికుడి మార్గంలో పశువుల కాపర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న రైల్వే అధికారులు

అధికారులు మాట్లాడుతూ పశువులను రైలు ఢీ కొడితే అవి చనిపోవడంతో పాటు రైలు పట్టాలు తప్పే ప్రమాదం ఉందని తెలిపారు. అలానే రైలు ఇంజిన్ పాడైపోయే అవకాశం ఉందని చెప్పారు. దీనివల్ల రైళ్ల సమయపాలన దెబ్బతింటుందని, అలానే ఎమర్జెన్సీ బ్రేకులు వేయడం వల్ల ప్రయాణికులకు ముప్పువాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో పశువులను లెవల్ క్రాసింగ్‌ల వద్ద దాటించేటప్పుడు కచ్చితంగా వాటికి రెట్రో రిఫ్లెక్ట్ ప్లేట్స్ అమర్చాలని సూచించారు. అలానే రైలు పట్టాల సమీపంలోకి పశువులను తీసుకురావొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌జీపీ పీఎఫ్ ఏఎస్ఐ బి.సుబ్బారావు, పీడబ్ల్యూఐ సాయికృష్ణ, పిడుగురాళ్ల ఎస్ఐపీఎఫ్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి



తెడ్ల లక్ష్మి (ఫైల్‌ఫొటో)

వెల్దుర్తి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన మండలంలోని కేపీగూడెంలో చోటుచేసుకుంది. మాచర్ల పట్టణానికి చెందిన వివాహిత తెడ్ల లక్ష్మి (60) శనివారం సాయంత్రం తన తల్లి ఊరైన వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు వెళ్లింది. తాను మాచర్లకు వెళ్తున్నానని చెప్పి రాత్రి ఇంటి నుంచి బయలుదేరింది. ఆదివారం మండలంలోని కేపీగూడెం సమీపంలోని ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద దుస్తులు లేకుండా విగతజీవిగా పడిఉంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సమందర్‌వలి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలి బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించా రు. లక్ష్మి మృతదేహం సగం కాలిపోయి ఉంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆత్మహత్య లేక ఏదైనా జరిగిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

కానిస్టేబుల్‌పై దాడి కేసులో నిందితుల అరెస్టు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో సమస్యాత్మక ప్రాంతంగా ఉన్న ఐతానగర్‌లో రౌడీషీటర్లను అణచివేసి శాంతియుత వాతావరణం నెలకొల్పుతామని టూటౌన్ సీఐ రాములనాయక్ అన్నారు. ఐతానగర్ అంబేద్కర్ విగ్రహం రోడ్డులో గత గురువారం పోలీసు కానిస్టేబుల్‌పై ఒక రౌడీ షీటర్, సస్పెక్ట్ షీట్లు ఉన్న ఇద్దరు మరొక యువకుడు కలసి దాడి చేశారు. ఈ ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, ఆదివారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రాముల నాయక్ విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గతంలో తెనాలిలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజాయి, అక్రమ మద్యం,



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాముల నాయక్

దొంగతనాలు తదితర కేసుల్లో చేబ్రోలు జాన్ విక్టర్, షేక్ బాబులాల్, దోమ రాకేష్ నిందితులుగా ఉన్నారని తెలిపారు. ఈ క్రమంలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని పలుమార్లు అప్పటి త్రీటౌన్ ప్రస్తుతం వన్‌టౌన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ కన్నా చిరంజీవి నోటీసులు ఇచ్చారని చెప్పారు. అలా ప్రతిసారి పోలీస్ స్టేషన్‌కు పిలిపించడం నిందితులకు ఇబ్బంది అనిపించి, కానిస్టేబుల్‌ను చంపేందుకు ప్రణాళిక వేశారని వెల్లడించారు. ఇందుకు ఐతానగర్‌కు చెందిన రౌడీ షీటర్ వేము నవీన్ సహాయం తీసుకున్నారని చెప్పారు. ఈ క్రమంలో ఐతానగర్ వైపు వెళ్తున్న కానిస్టేబుల్ చిరంజీవిపై ఈ నలుగురు నిలువరించి విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారని తెలిపారు. కానిస్టేబుల్ చిరంజీవి తప్పించుకొని స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని సీఐ వివరించారు. కేసు నమోదు చేసి, ముగ్గురు నిందుతులను ఐతానగర్ లింగారావు సెంటర్‌లో ఆదివారం అదుపులోకి తీసుకున్నామని, మరో నిందితుడు నవీన్ పరారిలో ఉన్నాడని వెల్లడించారు. ఎస్సై షేక్ సుభాని, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో వేస్ట్ కేబుల్స్ దగ్ధం

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తెనాలి రూరల్ మండలం సంగంజాగర్లమూడి రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది వివరాల మేరకు.. రైల్వేస్టేషన్ వద్ద వేస్ట్ కేబుల్స్‌లో మంటలు చెలరేగాయి. స్టేషన్ మాస్టర్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకొని ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. దగ్ధమైన కేబుల్స్ విలువ సుమారు రూ.40 వేలు ఉండవచ్చని అధికారులు తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 514.50 అడుగులు ఉంది. ఇది 139.43 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

గుంటూరు సిటీ వార్తలు

♦ గుంటూరు తూర్పు ♦ పశ్చిమ

బ్రాహ్మణుల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్ద పీట

● టీడీపీ నేత, మేయర్ అభ్యర్థి కోవెలమూడి రవీంద్ర

గుంటూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని టీడీపీ నేత, మేయర్ అభ్యర్థి కోవెలమూడి రవీంద్ర (నాని) తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన కోనూరు సతీష్‌శర్మ అభినందన సభ అమరావతి రోడ్డు హిందూ కాలేజ్ ఫార్మసీ కళాశాలలోని సెమినార్ హాల్లో ఆదివారం జరిగింది. ఐబిఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెలవర్తిపాటి పాండురంగ విఠల్ సభకు అధ్యక్షత వహించారు. నాని మాట్లాడుతూ బ్రాహ్మణుల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమాఖ్య అడ్వైజరీ కమిటీ చైర్మన్ సత్యవాడ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ సేవాభావం, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసే తత్వం సతీష్‌శర్మకు ముందు నుంచే ఉన్నాయన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, ఇస్రో మాజీ శాస్త్రవేత్త చందు సాంబశివరావులు మాట్లాడుతూ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారంలో సతీష్‌శర్మకు తాము అండగా నిలుస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు సతీష్ శర్మ మాట్లాడుతూ బ్రాహ్మణ కార్పొరేషన్ పథకాల ద్వారా మరింత మంది బ్రాహ్మణులకు ప్రయోజనం చేకూరేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 2025-27 గుంటూరు జిల్లా బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య నూతన కమిటీ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించి నియామక పత్రాలను అందజేశారు. సతీష్ శర్మ దంపతులను జిల్లా కమిటీ సభ్యులు గజమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శంకరమంచి లలిత శాస్త్రి, ప్రధాన కార్యదర్శి మాచిరాజు మురళీ కృష్ణ పలువురు నాయకులున్నారు.



సతీష్‌శర్మ దంపతులను సత్కరిస్తున్న సమాఖ్య నాయకులు

కేవీలో ముగిసిన ప్రాంతీయ కబడ్డీ పోటీలు

గుంటూరు (విద్య), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : నల్లపాడులోని కేంద్రీయ విద్యాలయంలో ప్రాంతీయ స్థాయి అండర్ 14 బాలుర కబడ్డీ పోటీలు ఆదివారం ముగిశాయి. రాష్ట్రంలోని వివిధ కేంద్రీయ విద్యాలయాల నుంచి 94 మంది విద్యార్థులు ఎనిమిది జట్లుగా పోటీల్లో పాల్గొన్నారని ప్రిన్సిపల్ ఎస్.విజయ్ కుమార్ వెల్లడించారు పోటీలను తిరుపతి కేంద్రీయ విద్యాలయం టీజీటీ మోడెం మల్లయ్య పర్యవేక్షించారు. పోటీల్లో కేంద్రీయ విద్యాలయం గుంటూరు షిఫ్ట్-1 విద్యార్థులు ప్రథమ బహుమతి, కేంద్రీయ విద్యాలయం సూర్యలంక ద్వితీయ బహుమతి, కేంద్రీయ విద్యాలయం గుంటూరు షిఫ్ట్- 2 తృతీయ బహుమతి గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎస్.ఆనంద్, ఉపాధ్యాయులు టి.లక్ష్మీ ప్రసన్న, సునీల, పీఈటీ అంజలి, ఆర్.చాంగ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ ఎస్.విజయ్ కుమార్

ఇగ్నో వర్సిటీ కోర్సులతో మెరుగైన ఉపాధి అవకాశాలు

గుంటూరు (విద్య), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఇగ్నో (ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం) యూనివర్సిటీ అందిస్తున్న కోర్సుల ద్వారా మెరుగైన ఉపాధ్యాయ అవకాశాలు లభిస్తాయని కో ఆర్డినేటర్ డాక్టర్ డీవీ చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం కళాశాలలో ఇగ్నో స్టడీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఇండక్షన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వయసుతో సంబంధం లేకుండా చదువుకోవాలి అనే లక్ష్యంతో ఉన్న వారు ఎవరైనా ఇగ్నో ఓపెన్ యూనివర్సిటీ అందించే కోర్సులను ఉపయోగించుకోవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇగ్నో రీజనల్ డైరెక్టర్ డాక్టర్ పి.శరత్ చంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, స్టడీ సెంటర్ కౌన్సిలర్ డాక్టర్ ఎం ఎస్ నారాయణ, అసిస్టెంట్ కో ఆర్డినేటర్స్ డాక్టర్ పి.దేవేంద్ర గుప్త, ఎం.మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

పెన్షనర్ల సెల్ నెంబర్లు మారితే తంటాలే

● ఈదర వీరయ్య

గుంటూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పెన్షనర్లు తరచూ సెల్ నెంబర్లు మార్చటంతో తంటాలు తప్పటం లేదని పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల చేవాణి నెంబర్లు మార్చటం సర్వసాధారణమైపోయిందని, కొన్ని కంపెనీలు బంపర్ ఆఫర్లతో ఉచితంగా సిమ్ కార్డులను జారీ చేస్తున్నాయన్నారు. మరికొన్ని కంపెనీలు ఉచిత టాక్‌టైమ్‌ను అందిస్తున్నాయన్నారు. ఇక సిగ్నల్స్ సమస్యలతో నెంబర్లు మార్చేవారు లేకపోలేదని, దీర్ఘకాలికంగా వినియోగిస్తున్న వారు కూడా వివిధ కంపెనీలు ఇచ్చే బంపర్ ఆఫర్లతో సిమ్ మాయాజాలంలోపడి ఇబ్బందులు కొని తెచ్చుకుంటున్నారన్నారు. అయితే నెంబరు మార్చిన వారు బ్యాంకులోను, తమ ఖాతాలో మార్చిన నెంబరు వారికి తెలియజెప్పకపోవటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కొంత మంది వినియోగదారులైతే రెండు, మూడు నెలలకొకసారి సిమ్ నెంబర్లు మార్చేస్తున్నారని, ఇలా సిమ్ కార్డులు తీసుకొనే నూతన వినియోగదారులు తంటాలు పడుతున్నారన్నారు. అలా కాకుండా చిన్నపాటి జాగ్రత్తలతో ఇలాంటి వాటిని అధిగమించవచ్చని సూచించారు.

సాధారణంగా ఇలా సెల్ నెంబరు ఇవ్వాల్సిన చోట దీర్ఘకాలిక దృష్టితో ఆలోచించాలని, ఒకటి కంటే ఎక్కువ సిమ్‌లు, వినియోగించేవారు ఏ ఖాతాకు ఏ నెంబరు అనుసంధాన నెంబరు ఇచ్చారో స్పష్టంగా డైరీలో రాసుకుంటే మంచిదని స్పష్టం చేశారు. ఉద్యోగులు తమ కార్యాలయ నెంబరు కూడా అనుసంధానం కోసం ఇస్తుంటారన్నారు. అలాంటి వారు ఒక్కటే సెల్ నెంబరు కాకుండా వ్యక్తిగత సెల్ నెంబరును కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వ్యక్తిగత సెల్ నెంబరును మాత్రమే తమ కాంటాక్టు నెంబరుగా ఇవ్వాలన్నారు. సిగ్నల్ వ్యవస్థ సరిగ్గా లేదని భావించి నెంబరు మార్చుకోవద్దని, పోర్టబులిటి సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంపెనీలు అడ్డగోలు ఆఫర్లు అందిస్తున్నాయని, నెంబర్లు మార్చితే భవిష్యత్తులో సమస్యలు తలెత్తుతాయన్న విషయాన్ని గ్రహించాలన్నారు. ఒకే నెంబరు ఉండటంతో ఖాతాలు ప్రారంభించినప్పుడు ఆ నెంబరు అనుసంధానం చేయటంతో మిస్డ్ కాల్ సౌకర్యంతో ఖాతాలలో ఎంత నిల్వ ఉన్నది, ఎంత డ్రా చేస్తున్నారనేది ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. చేవాణి వినియోగదారులందరూ పోర్టబిలిటీ సదుపాయాన్ని వినియోగించుకోవాలని వీరయ్య కోరారు.

మల్లేశ్వరస్వామి ఆలయంలో రాహు కేతు పూజలు

పెదకాకాని, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానం లోని రాహుకేతు గ్రహాలకు ప్రత్యేక పూజలు జరిగాయి. అమావాస్య ఆదివారం సందర్భంగా ఆలయంలో రాహు కేతు పూజలు భక్తులు అధిక సంఖ్యలో జరిపించుకున్నారు. తెల్లవారుజామున 4.30 నుంచి సాయంత్రం రాహుకాల సమయం 4:30 గంటల వరకు 1509 టిక్కెట్లు భక్తులకు విక్రయించినట్లు ఆలయ ఉపకమిషనర్, కార్యనిర్వహణాధికారి గోగినేని లీలా కుమార్ తెలిపారు. రాహు కేతు పూజల ద్వారా ఆదివారం రూ.7,54,500లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు.



నల్లపాడు రోడ్డులో డ్రెయిన్ నిర్మాణ పనులు



చుట్టుగుంట సెంటర్‌లో చురుగ్గా సాగుతున్న డ్రెయిన్ నిర్మాణాలు

ఈ సారైనా వరద ముంపు తప్పేనా!

● నల్లపాడు రోడ్డులో మరోసారి అవుట్ ఫాల్ డ్రెయిన్ నిర్మాణం

గుంటూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నల్లపాడు రోడ్డులోని పరిసర ప్రాంతాలకు వరద ముంపును తప్పించేందుకు జీఎంసీ అధికార యంత్రాంగం పకడ్బందీగా వ్యవహరిస్తోంది. వర్షాలు పడిన ప్రతిసారి నల్లపాడు రోడ్డులోని పలు ప్రాంతాల్లో వరద ముంపు స్థానికులను భయాందోళనకు గురి చేస్తోంది. వర్షాలు పడ్డాయంటే చుట్టుగుంట సెంటర్ పరిసర ప్రాంతాలైన శ్రీ లక్ష్మీనగర్, సాయినగర్, హనుమాన్, శ్రీరామ్ నగర్, ఏటీ అగ్రహారంలోని కొన్ని ప్రాంతాల్లో వరద నీటి ముంపునకు గురవుతున్నాయి. భారీ వర్షాలు పడ్డాయంటే వర్షపునీరు ఇళ్ళలోకి కూడా చేరుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం రాకపోకలు సాగించాలన్నా నరకయాతన పడుతున్నారు. గంటల తరబడి నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. గతంలో డ్రెయిన్ నిర్మాణాలు చేపట్టినా పెద్దగా ప్రభావం చూపలేకపోయాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా అవుట్ ఫాల్ డ్రెయిన్‌ల నిర్మాణాలను చేపట్టారు. మిర్చియార్డు నుంచి చుట్టుగుంట రైతుబజారు వరకు డ్రెయిన్ నిర్మాణ పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. అంతేగాక జీటీ రోడ్డులోను మెడికల్ క్లబ్ వరకు డ్రెయిన్‌లను నిర్మిస్తున్నారు. తాజాగా డ్రెయిన్‌ల నిర్మాణ పనులతో స్థానికుల నుంచి హర్షం వ్యక్తమవుతుంది. అయితే ఈ దఫా వర్షాకాలంలో ఏమాత్రం వరద ముంపు తప్పుతుందో చూడాలని చెబుతున్నారు.

ప్రత్యామ్నాయం లేకపోవటంతో నిలుస్తోన్న మురుగు

డ్రెయిన్‌లను నిర్మిస్తోన్న క్రమంలో మురుగునీరు పోయేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవటంతో నల్లపాడు రోడ్డులోని పరిసర కాలనీల్లో మురుగునీరు పెద్ద ఎత్తున నిలుస్తోంది. దాంతో నీరు వెనక్కి వెళ్ళి ఖాళీ స్థలాలు చెరువులను తలపిస్తోన్నాయి. డ్రెయిన్‌లను నిర్మించే సమయంలో ప్రత్యామ్నాయంగా మురుగునీరు పారేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అంతేగాక కాల్వల్లో వ్యర్థాలను, సిల్ట్‌ను రోడ్డు పక్కనే పడేయటంతో వాహనచోదకులు నానా ఇబ్బందులు పడుతోన్నారు. అసలే భారీ వాహనాలతో పాటు సాధారణ వాహనాలతో నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించుకోవాలని, లేకుంటే ప్రమాదాలు జరిగే ఆస్కారముంటుందని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు అధికార యంత్రాంగం పర్యవేక్షణ చేయాలని కోరుతున్నారు.



ఖాళీ ప్రదేశాల్లో నిలుస్తున్న మురుగునీరు (ఫైల్)

కీళ్ళవాతంపై అప్రమత్తంగా ఉండాలి

గుంటూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ప్రధానంగా వృద్ధుల్లో వచ్చే కీళ్ళవాతంపై అప్రమత్తంగా వ్యవహరించాలని రుమటాలజిస్టు డాక్టర్ మానుకొండ మురళీకృష్ణ తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం కీళ్ళవాతం, జాయింట్ పెయిన్స్ సమస్యలపై జరిగిన ఆరోగ్యసభలో ఆయన ప్రసంగించారు. సాధారణంగా జాయింట్ పెయిన్స్ సమస్య వచ్చినప్పుడు ఆర్థోపెడిక్, న్యూరాలజీ వైద్యులను సంప్రదిస్తుంటారని, వాటిల్లో రుమటాలజీకి సంబంధించిన సమస్య గుర్తించకపోతే కాలయాపన జరిగి వ్యాధి తీవ్రత పెరిగి ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిపారు. జాయింట్ పెయిన్స్ సమస్య అనిపించినప్పుడు సాధ్యమైనంత త్వరగా రుమటాలజిస్టును సంప్రదిస్తే మంచి ఫలితముంటుందన్నారు. కీళ్లవాతం ఉన్నవారు బంగాళదుంప, చిలకడ దుంప, శనగపిండి, మాంసాహారం, పులుపు వస్తువులు, పప్పు లాంటి ఆహార పదార్థాలు తీసుకోరాదని అన్నారు. ఈ సందర్భంగా అవగాహన సభ్యులు డాక్టర్ మానుకొండ మురళీకృష్ణను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశానికి టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, అనవేమ ట్రస్ట్ అధ్యక్షుడు చల్లా అంజిరెడ్డి, రాడికల్ హ్యూమనిస్ట్ కె.చంద్రశేఖర్, విశ్రాంత ఆంధ్రాబ్యాంక్ మేనేజర్ ఫణీంద్ర కుమార్ పాల్గొని ప్రసంగించారు.

శ్రీ మహాలక్ష్మి అమ్మవారి వార్షిక మహోత్సవాలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శారదా కాలనీ, 7వ లైన్లో కొలువైన శ్రీ మహాలక్ష్మి అమ్మవారి 31వ వార్షిక మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ, గణపతిపూజ తదితర సేవలు జరిగాయి. అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారికి వైభవంగా పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం కే.శ్రీనివాసరావు బృందం ప్రదర్శించిన భజన కార్యక్రమం అలరించింది. కార్యక్రమాల్ని కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం

నేత్రానందం నృత్యాభినయనం



ఒడిస్సీ నృత్యాన్ని ప్రదర్శిస్తున్న గోకుల్ కృష్ణ



మణిపూరి నృత్యాన్ని ప్రదర్శిస్తున్న బాద్‌షా

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై జరుగుతున్న మహామంజీర నాదం ఐదో రోజుకు చేరుకున్నాయి. ఆదివారం కార్యక్రమాల్ని విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య ప్రారంభించగా, సంస్థ అధ్యక్షుడు డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. సభలో తిరుపతి ఎస్వీ సంగీత నృత్య కళాశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఎస్.జమునారాణి, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, డాక్టర్ కాజా వెంకట సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొని తిరుపతి ఎస్వీ సంగీత నృత్య కళాశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు అరవీటి ప్రభావతి, విశ్రాంత నృత్య శాఖాధిపతి దేవేంద్ర పిళ్ళై లను మరంగంటి కాంచనమాల జీవిత సాఫల్య పురస్కారంతో ఘనంగా సత్కరించారు. సభానంతరం పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రముఖ నృత్య కళాకారుడు ఎస్‌కె బాదుషా మణిపురి నాట్యాన్ని, భువనేశ్వర్‌కు చెందిన గోకుల్ కృష్ణ ఒడిస్సీ నృత్యాన్ని, తిరుపతికి చెందిన డాక్టర్ శరత్ చంద్ర భరతనాట్యాన్ని ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. కార్యక్రమాలను వెంకటగిరి నాగలక్ష్మి, పఠాన్ మొహిద్దీన్ పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో పాస్టర్ మృతి

● ఆయన భార్యకు గాయాలు

మేడికొండూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలడుగు అడ్డరోడ్డు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాస్టర్ మృతి చెందగా ఆయన భార్య తీవ్రంగా గాయపడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు నల్లకుంటకు చెందిన తమ్మి శెట్టి జక్కరయ్య(45) పాస్టర్‌గా పనిచేస్తుంటాడు. తన భార్య పద్మతో కలసి ద్విచక్ర వాహనంపై పిడుగురాళ్ల వెళుతుండగా మార్గమధ్యంలో పాలడుగు అడ్డరోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈప్రమాదంలో పాస్టర్ జక్కరయ్యతో పాటు ఆయన భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ జక్కరయ్య మృతి చెందాడు. అతని భార్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేరేచర్లలో గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్య

మేడికొండూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలం పేరేచర్ల గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. బండరాయితో తల, ముఖంపై కొట్టి హతమార్చారు. పేరేచర్ల సమీపంలోని నరసరావుపేట రోడ్డు రైల్వే బ్రిడ్జి పక్కన పొలాల్లో ఆదివారం మృతదేహం పడి ఉండగా అందిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఇతని వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉండవచ్చునని పోలీసులు తెలిపారు. క్లూస్ టీం బృందం అక్కడికి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. మేడికొండూరు సీఐ నాగూర్ మీరా సాహెబ్ కథనం ప్రకారం మృతుని వంటిపై కేవలం కట్ డ్రాయర్ మాత్రమే ఉందని, లుంగీ, షర్ట్ పక్కన పడి ఉన్నాయి. జనసంచారం అంతగా ఉండని ఈ ప్రాంతానికి నిత్యం మద్యం రాయుళ్ల వస్తుంటారని పోలీసుల విచారణలో తెలిసింది. అదేవిధంగా ఆదివారం సాయంత్రం కొందరు వ్యక్తులు అక్కడికి వచ్చి మద్యం సేవించారని సాయంత్రం ఐదు గంటల సమయంలో వారిలో వారు గొడవ పడుతూ కొట్టుకున్నారని, దూరం నుంచి గమనించిన ఒక వ్యక్తి పోలీసులకు తెలిపారు. అయితే వారి గురించిన సమాచారం ఎవరూ చెప్పలేకపోతున్నారు. స్థానికులే అయి ఉండవచ్చునని, మద్యం మత్తులో గొడవ పడి కొట్టుకొని ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

డీఎస్సీపై అభ్యంతరాలను పరిశీలించాలి

● డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న



మాట్లాడుతున్న రామన్న, పాల్గొన్న డీవైఎఫ్ఐ సభ్యులు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీపై అభ్యర్థుల అభ్యంతరాలను పరిశీలించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న ప్రభుత్వాన్ని కోరారు. బ్రాడీపేట యూనియన్ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వయోపరిమితి పెంపు, పరీక్షకు 90 రోజుల సమయం కావాలని, ఒకే జిల్లాకు ఒకే పేపర్ వంటి అభ్యంతరాలను పరిష్కరించాలని కోరారు. వయోపరిమితి 47 సంవత్సరాలకు పెంచాలని, పరీక్షకు సన్నద్ధమయ్యేందుకు 46 రోజులు సరిపోవని అన్నారు. సమస్యలపై విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టి సారించాలన్నారు. జిల్లా కన్వీనర్ వై.కృష్ణకాంత్ మాట్లాడుతూ ఉద్యోగ నోటిఫికేషన్ వచ్చిన తర్వాత సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేయాల్సిన పరిస్థితి ప్రభుత్వాలు కల్పిస్తున్నాయన్నారు. సమావేశంలో పి.భార్గవ్, పి.భాషా, ఎం.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

కొడుకుకు ఎలుకల మందు తాపించి తాను తాగిన తల్లి

● కొడుకు మృతి... తల్లి పరిస్థితి విషమం

గుంటూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఓ తల్లి తన కుమారుడికి ఎలుకలు మందు తాపించి తాను కూడా తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనలో కుమారుడు ఆదోని చంద్రశేఖర్ మణికంఠ (9) మృతి చెందగా తల్లి ఆదూరి కుమారి మృత్యువుతో పోరాడుతోంది. వివరాలు ఇలా ఉన్నాయి.. తురకపాలెంలో నివాసం ఉండే ఆదూరి గణేష్ గుండెపోటుతో గత మార్చి 30న మృతి చెందాడు. భర్త మృతి అనంతరం భార్య కుమారి కుమారుడు మణికంఠతో పాటు ఆమె అత్తమామలు తురకపాలెం రోడ్డులోని మహాప్రస్థానంలోని గదుల్లో ఉంటున్నారు. భర్త చనిపోయినప్పటి నుంచి కుమారి మానసికంగా దిగులుతో ఉంది. ఈ క్రమంలో అత్తమామల మధ్య ఏం జరిగిందో కానీ ఈనెల 24న రాత్రి కుమారుడితో కలిసి వచ్చేసింది. ఎలుకల మందు కొనుగోలు చేసి శీతల పానీయంలో కలిపి కుమారుడికి బలవంతంగా తాపించి అనంతరం ఆమె కూడా తాగింది. తర్వాత ఆటోలో ఆర్టీసీ బస్టాండ్‌కి వెళ్లి అక్కడి నుంచి బస్సులో అమరావతి చేరుకుంది. వారి కోసం గాలించిన అత్తమామలు పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆమె సెల్‌ఫోను ట్రాక్ చేసి అమరావతిలో ఉన్నట్లు గుర్తించారు వెంటనే అక్కడ ఉన్న వారి బంధువులకు సమాచారం ఇవ్వడంతో వారు వారిని అక్కడ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి కుమారుడు చంద్రశేఖర్ మణికంఠ మృతి చెందాడు. ఆదివారం వచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

ముగిసిన మెగా క్రికెట్ టోర్నమెంట్

● విజేతలకు ట్రోఫీని అందజేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నల్లపాడు రైల్వే గ్రౌండ్స్‌లో పరుచూరి వీర రాఘవరావు మెమోరియల్ ఆధ్వర్యంలో 16 రోజులుగా జరిగిన మెగా క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పాల్గొని టోర్నమెంట్ విజేతలకు ట్రోఫీని, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.... 16 రోజుల పాటు జరిగే ఈ మెగా టోర్నమెంట్‌లో దాదాపు 70 టీమ్‌లు పాల్గొన్నాయని, సాగర్ వారియర్స్ మొదటి స్థానం, జానీస్ బాయ్స్ ద్వితీయస్థానం, లోకల్ బాయ్స్ తృతీయ స్థానం సాధించిందని, వీరందరికీ శుభాకాంక్షలు తెలుపుతున్నానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. యువత క్రీడలలో రాణించాలని, క్రీడలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రోత్సహిస్తున్నారని, క్రీడల వలన ప్రభుత్వ కొలువులో క్రీడాకారులకు కూడా తొలి ప్రాధాన్యత దొరుకుతుందని, ఇంత పెద్ద టోర్నమెంట్ నిర్వహించిన పరుచూరి సంజీవరావును అభినందిస్తున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశాలు ఉచితం

● ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్

గుంటూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం ప్రకారం కేంద్ర, రాష్ట్ర సిలబస్ అనుసరించే కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం ఉచితంగా ప్రవేశాలు కల్పించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. విద్యా హక్కు చట్టంపై ఆంధ్రప్రదేశ్ సిటిజన్స్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ జిలాని ఆధ్వర్యంలో చేపట్టిన అవగాహన పోస్టర్‌ను ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్నారని చెప్పారు. పదో తరగతి ఫలితాల్లోనూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. రాష్ట్ర సిలబస్ అనుసరిస్తోన్న కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు విద్యా హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నసీర్

చంద్రబాబుతోనే బీసీల అభ్యున్నతి

● టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి వెంకట్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశేష కృషి చేస్తున్నారని టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి కందుకూరు వెంకట్ అన్నారు. దేవాలయాల్లో పనిచేసే నాయీబ్రాహ్మణులకు రూ.25 వేల కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వం జీవో జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ పాత గుంటూరు, నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ సమావేశ మందిరంలో చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను చంద్రబాబునాయుడు అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన బీసీ సంక్షేమ పథకాలను పునరుద్ధరించేలా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయీబ్రాహ్మణ పొలిటికల్ జేఏసీ ప్రధాన కార్యదర్శి మునగాటి రాజారావు, అద్దంకి రవి, తుళ్లూరు కిరణ్, నాగరాజు, కే రోజ్‌కుమార్, పలకలూరు శ్రీను పాల్గొన్నారు.



చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కందుకూరు వెంకట్ తదితరులు

ఉగ్రదాడికి ప్రతీకార చర్య జరగాలి

● జనసేన ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకార చర్య ఉంటుందని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ జనసైనికుడు బద్రి నాయుడు ఆధ్వర్యంలో సంగడిగుంట మూడు బొమ్మల సెంటర్లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆళ్ళ హరి మాట్లాడుతూ కాశ్మీర్ పునఃవైభవాన్ని చూడలేకే ఇలాంటి దాడులకు దాయాది దేశం పాల్పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిరికిపంద చర్యలతో భారతదేశాన్ని ఆస్తిత్వ పరచాలనుకోవటం మూర్ఖత్వమన్నారు. ముష్కరుల వేటలో ప్రధాని మోదీ తీసుకునే నిర్ణయాలకు దేశం మొత్తం మద్దతుగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర కార్యదర్శి మెహబుబ్ భాషా, కొలసాని బాలకృష్ణ, శ్రీకాంత్, సోమి శంకరరావు, సోమి ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం, జొన్నలగడ్డ గ్రామంలో ఆదివారం షుగర్, బీపీ, ఇతర వ్యాధులకు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామ మాజీ ఉప సర్పంచ్ వంగా నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ఎం.నరేంద్రరెడ్డి, హర్షవర్ధన్, డాక్టర్ కే.శంకర్‌రెడ్డి పాల్గొని దాదాపు 320 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, రెండు నెలలకు సరిపడా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మరోసారి కస్టడీకి ఇవ్వండి

● కోర్టులో నగరంపాలెం పోలీసుల పిటిషన్

గుంటూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పోలీసుల అదుపులో ఉన్న చేబ్రోలు కిరణ్‌కుమార్, పోలీసులపై దౌర్జన్యం చేసిన కేసులో నిందితుడైన వైసీపీ నేత, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను మరోసారి కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నగరంపాలెం పోలీసులు దాఖలు చేసిన పిటిషన్ కోర్టులో ఇరువర్గాల వాదనలు జరిగాయి. దీనిపై సోమవారం కోర్టు నిర్ణయం వెలువరించనుంది.

గతంలో రెండు రోజుల కస్టడీకి కోర్టు అనుమతించినా రాజమండ్రి కేంద్ర కారాగారం నుంచి గుంటూరుకు తీసుకురావడంలో జాప్యం జరిగింది. దీంతో ఒక్కరోజే మాధవ్‌ను పోలీసులు విచారించారు. అయితే మాధవ్ వాస్తవాలు చెప్పకపోవడంతో తాజాగా మరోసారి కస్టడీకి ఇవ్వాలని పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై కోర్టులో ఇరువర్గాల వాదనలు కూడా ముగిశాయి. దీంతో తీర్పును సోమవారం వెలువరించనున్నారు.

దిక్సూచి DIKSUCHI

సివిల్స్ ర్యాంకర్స్ వాయిస్

ప్రతి అటెంప్ట్‌లో ఇంప్రూవ్‌మెంట్

❐ మీ కుటుంబ నేపథ్యం ఏమిటి? ఎంత వరకు చదువుకున్నారు?

జ: మాది ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం. ఒకటి నుంచి ఐదు వరకు ఉట్నూరులో, ఆరు నుంచి పది వరకు కాగజ్‌నగర్ నవోదయ, తరవాత త్రిచిలోని త్రిబుల్ ఐటీలో బీటెక్ మెకానికల్ పూర్తి చేశాను. నాన్నపేరు గోవింద్‌జాదవ్, హెడ్ కానిస్టేబుల్. అమ్మ కవిత, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. అక్క శృతి, వైద్యురాలు.

❐ సివిల్స్‌లో మీ ప్రిపరేషన్ ఎలా సాగింది? ఈ ప్రయాణాన్ని ఎప్పుడు మొదలు పెట్టారు?

జ: 2019లో గ్రాడ్యుయేషన్ పూర్తయింది. ఆ తరవాత డిల్లీకి వెళ్లి ఒక సంవత్సరం కోచింగ్ తీసుకుందాం అనుకున్నాను. అయితే కొవిడ్ ఎఫెక్ట్‌తో మధ్యలోనే వదిలేసి వచ్చేశాను. తొలి ప్రయత్నంలో ప్రిలిమ్స్ కూడా క్వాలిఫై కాలేదు. 2020, 2021లో మళ్లీ రాశాను. అయితే ప్రిలిమ్స్‌లో అర్హత సాధించా, కాని మెయిన్స్ దాటలేదు. 2022లో ఇంటర్వ్యూకు వెళ్లాను. కానీ ర్యాంకు రాలేదు. మళ్లీ 2023లో మెయిన్స్ దశ దాటలేక పోయాను. అయితే అదే సంవత్సరం 'ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్' వచ్చింది. ఆరో ప్రయత్నంలో 2024లో విజయం సాధించాను. నా ర్యాంకుకు ఐఏఎస్ రావచ్చు.

❐ మొదటి సారి విఫలమైనప్పుడు మిమ్మల్ని మీరు ఎలా మోటివేట్ చేసుకున్నారు....?

జ: సివిల్స్ పరీక్షలు రాసిన ప్రతీసారి నాలో కొంత ఇంప్రూమెంట్ కనిపించింది. అదే ప్రధాన కారణం. మూడో ప్రయత్నంలో ఇంటర్వ్యూ వరకు వెళ్లాను. దీంతో ఏదో వస్తుందన్న ఆశ పెరిగింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు స్నేహితులు మంచి సలహాలు, సూచనలు ఇచ్చారు.



సాయి చైతన్య జాదవ్ 68వ ర్యాంకు

❐ రోజుకు ఇన్ని గంటలు చదవాలన్న నియమం ఏమైనా పెట్టుకున్నారా?

జ: ఎన్ని గంటలు ప్రిపేర్ అనేది కాదు కాని ఎంత చదివితే అర్థమవుతుందో అంత వరకే చదివే వాడిని. పరీక్షలు దగ్గర పడినప్పుడు మాత్రం రోజుకు 10 నుంచి 13 గంటలు చదివే వాడిని. ఎన్ని గంటలు చదివాము అన్నది కాకుండా, ఎంత అర్థం చేసుకో గలిగాం అన్నది ముఖ్యం.

❐ సివిల్స్ రాయాలంటే కోచింగ్ తప్పనిసరా?

జ: నా ఉద్దేశ్యంలో కోచింగ్ అవసరం లేదు. ఒకరిని చూసి మరొకరు కోచింగ్‌కు వెళుతున్నారు. ఏదో కొంత తప్ప, గత కోచింగ్ ప్రస్తుతం ఉపయోగపడతుందన్న గ్యారెంటి లేదు. స్నేహితులను చూసి నేను కూడా కోచింగ్‌కి వెళ్లాను. కాని మధ్యలోనే వచ్చేశాను. ఐదేళ్లుగా సొంతంగానే సిద్ధం అయ్యాను. కాకపోతే స్నేహితులతో కలిసి మాక్ ఇంటర్వ్యూలు చేయడం జరిగింది.

❐ జనరల్ స్టడీస్‌కు, అలాగే ఆప్షనల్‌కు ఏ మెటీరియల్ చదివారు...?

జ: రోజు న్యూస్ పేపర్ చదవడంతో మన చుట్టు పక్కల ఏం జరుగుతుందనే విషయంపై అవగాహన వస్తుంది. ఇది ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ ఇలా అన్ని స్థాయిల్లో ఉపయోగపడుతుంది. ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో రకమైన ప్రామాణిక బుక్స్ అవసరం. ఉదాహరణకు నా ఆప్షన్ ఆంత్రోపాలజీ. మొదటి నుంచి దీనితోనే సివిల్స్ రాస్తున్నాను. మొదట్లో ఒక నెల రోజులు కోచింగ్ వెళ్లినా అంతగా అర్థం కాలేదు. మొదటి సారి మెయిన్స్ రాక పోవడంతో ఎక్కువ సమయం దొరికింది. దాంతో సొంతగా నోట్స్ ప్రిపేర్ చేసుకున్నాను.

❐ సివిల్స్‌లో మిమ్మల్ని ఏ బోర్డు ఇంటర్వ్యూ చేసింది...? ఎంత సేపు జరిగింది. ఎలాంటి ప్రశ్నలు అడిగారు?

జ: నన్ను రాజ్‌శుక్లా సర్ బోర్డు 30 నిమిషాల పాటు ఇంటర్వ్యూ చేసింది. ఆరోజు నాలుగో వ్యక్తిని. ఇంటర్వ్యూ అప్లికేషన్ ఫాంలో మొత్తం 22 సర్వీస్‌లను పేర్కొనాల్సి ఉండగా నేను ఐఏఎస్, ఐపీఎస్ రెండు సర్వీస్‌లను మాత్రమే పెట్టాను. ఇంటర్వ్యూలో దీనిపై అడిగారు. నాకు ఆల్ రెడీ ఆంధ్రప్రదేశ్ క్యాడర్ సంబంధించిన 'ఐఎఫ్ఎస్' సర్వీస్ ఉందని చెప్పాను. ఏపీ నుంచి విడిపోయిన తరవాత తెలంగాణలో అభివృద్ధి ఎలా ఉంది. అలాగే కేవలం హైదరాబాద్ మాత్రమే అభివృద్ధి చెందిందా? అని అడిగారు. నా సొంత జిల్లా ఆదిలాబాద్ కాబట్టి అడవుల గురించి అడిగారు. తెలంగాణ ఉద్యమం గురించి, ఆదిలాబాద్ గిరిజన తెగల గురించి ప్రశ్నించారు. మా నాన్న పోలీసు కాబట్టి ఆ డిపార్ట్‌మెంట్ గురించి కూడా అడిగారు.

ఎం. రాజేశ్వర్, ఆదిలాబాద్

విష్ణుమూర్తి అవతారాలేమిటి?

సివిల్స్ ప్రిపరేషన్ అంటేనే సుదీర్ఘ ప్రయాణం. ఇందులో ఎన్ని ఆటుపోటులు వచ్చినా చివరి వరకు పట్టు విడవకూడదు. అలా విజేతగా నిలిచిన వ్యక్తి శ్రీకాకుళానికి చెందిన బాన్న వెంకటేష్. ప్రిలిమ్స్, మెయిన్స్‌లో తన ప్రిపరేషన్ ఎలా సాగింది, ఇంటర్వ్యూలో ఎలాంటి ప్రశ్నలు అడిగారో 'దిక్సూచి' పాఠకులతో ఆయన పంచుకున్నారు.



బాన్న వెంకటేష్ 15వ ర్యాంకు

❐ సివిల్స్‌లో 15వ ర్యాంకు సాధించినందుకు అభినందనలు.. మీ కుటుంబ నేపథ్యం చెప్పండి.. ఏమి చదువుకున్నారు..?

జ: థాంక్యూ. మాది శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం అల్లాడపేట గ్రామం. తొమ్మిదో తరగతి వరకు శ్రీకాకుళంలో, ఇంటర్‌మీడియట్ విశాఖపట్టణంలో.. బీటెక్ తమిళనాడు రాష్ట్రం తిరుచరాపల్లిలో పూర్తిచేశాను. నాన్న చంద్రరావు వ్యవసాయం చేస్తారు. అమ్మ రోహిణి గృహిణి. మా తమ్ముడు వంశీ 'ఇస్రో'లో సైంటిస్ట్.

❐ మీ ప్రిపరేషన్ ఎలా సాగింది? సివిల్స్ ప్రయాణాన్ని ఎప్పుడు మొదలుపెట్టారు?

జ: బీటెక్ తర్వాత నెలకు రూ. 1.5 లక్షలతో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేశాను. కానీ సంతృప్తి లేదు. ఏదైనా చేయాలన్న లక్ష్యంతో పాజిటివ్‌గా ఆలోచించాను. జాబ్‌కు రిజైన్ చేసి 2021 అక్టోబరు నుంచి సివిల్స్ ప్రిపరేషన్ మొదలుపెట్టాను.

❐ ఈ ప్రయాణంలో తొలుత విఫలం అయినప్పుడు ఎలా మోటివేట్ చేసుకున్నారు?

జ: 2022లో తొలి ప్రయత్నంలో ప్రిలిమ్స్ కూడా దాటలేదు. కానీ డీమోటివేట్ కాకుండా సిలబస్ కంప్లీట్ చేసుకుంటూ రెండో దఫా పరీక్షకు బాగా సిద్ధం అయ్యాను. 2023లో 467 ర్యాంకు వచ్చింది. ఆంధ్ర కేడర్ ఐపీఎస్ వచ్చింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో నేషనల్ పోలీస్ అకడామీలో ఉన్నా. 2024లో ఐఏఎస్ లక్ష్యంగా ప్రిపేర్ అయ్యాను.

❐ ఇంత మంచి ర్యాంకు వస్తుందని ఊహించారా?

జ: నేను వంద నుంచి 150లోపు ర్యాంకు వస్తుందని ఊహించాను. 15వ ర్యాంకు వచ్చింది. ఐఏఎస్ కావాలనుకున్నాను. అదే వచ్చింది.

❐ రోజుకి ఇన్ని గంటలు తప్పనిసరిగా చదవాలనే నియమం ఏమైనా పెట్టుకున్నారా?

జ: సివిల్స్ అంటే చదువు విషయంలో ప్లానింగ్ ఉండాలి. రోజుకి ఎనిమిది గంటలు కచ్చితంగా చదివా. ఒక్కోసారి అంతకంటే ఎక్కువే అయ్యేది.

❐ సివిల్స్ లాంటి అత్యున్నత లక్ష్యం పెట్టుకున్నవారు కోచింగ్ తప్పనిసరిగా తీసుకోవాలా? ఒకవేళ మీరు కోచింగ్ తీసుకుంటే అది ఎలా ఉపయోగపడింది?

జ: ఆన్‌లైన్ క్లాసులకు హాజరయ్యాను. మాక్ టెస్ట్‌లు రాశాను. బాగా ప్రిపేర్ అయ్యాను. రెండో అటెంప్ట్‌కు ఐపీఎస్ వచ్చింది. మూడో ప్రయత్నంలో ఐఏఎస్.

❐ జనరల్ స్టడీస్‌కు మెటీరియల్ ఏమి చదివారు? అలాగే ఆప్షనల్‌కు ఏమి మెటీరియల్ చదివారు?

జ: అందరి ప్రిపరేషన్‌లాగానే నాదీ జరిగింది. ఆప్షనల్‌గా 'జాగ్రఫీ' ఎంచుకున్నాను.

❐ మిమ్మల్ని ఏ బోర్డు ఇంటర్వ్యూ చేసింది? మొత్తం ఎంత సేపు జరిగింది? ఇంటర్వ్యూలో మిమ్మల్ని ఎలాంటి ప్రశ్నలు అడిగారు? ఏమైనా గుర్తున్నాయా?

జ: లెఫ్టినెంట్ జనరల్ రాజ్ శుక్లా సర్ బోర్డు అరగంటకు పైగా నన్ను ఇంటర్వ్యూ చేసింది. ప్రస్తుతం ఐపీఎస్‌లో ఉన్నావుగా.. మరెందుకు ఐఏఎస్‌కు రావాలనుకుంటున్నావు..? అనే ప్రశ్న వేశారు. అలాగే ఇంజినీరింగ్ అంశాలకు సంబంధించి కొన్ని అంశాలపై ప్రశ్నలు వేశారు. మీ జిల్లాకు మీరు కలెక్టర్ అయితే అక్కడ ఉన్న సమస్యలను ఏవిధంగా పరిష్కరించగలరు అని కూడా అడిగారు.

❐ మీకు అత్యంత కఠినం ఈ ప్రశ్నకు జవాబు చెప్పడం అని భావించిన ప్రశ్న ఏమైనా ఉందా?

జ: ఎలక్ట్రానిక్స్‌లో కొన్ని అంశాలపైనా, టెక్నాలజీ గురించి కొన్ని డీటెయిల్డ్‌గా చెప్పమన్నారు. నాకు ఎంతవరకు తెలుసో అంతవరకే చెప్పాను. తెలియని అంశంపై సైలెంట్‌గానే ఉన్నా.

❐ అతి సులువు ప్రశ్నగా దేనిని భావించారు?

జ: మీ పేరు 'వెంకటేష్' కదా.. ఆ పేరుకున్న అర్థం ఏమిటి అని అడిగారు. పాపాలను హరించేవాడని.. విష్ణు అవతారంలో ఒకరైన శ్రీ వెంకటేశ్వరుని పేరు అది అని చెప్పాను. అయితే విష్ణు అవతారాలలో నాలుగు చెప్పండి అని అడిగితే నాలుగు అవతారాలను చెప్పేశాను.

❐ తెలుగు రాష్ట్రాలకు సంబంధించి మిమ్మల్ని అడిగిన ప్రశ్నలు ఏవి?

జ: తెలంగాణ గురించి అడగలేదుకానీ.. ఆంధ్రప్రదేశ్ గురించి ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో సువిశాలమైన తీరప్రాంతముంది కదా.. ఏవిధంగా అభివృద్ధి చేయవచ్చు... అలాగే ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న సమస్యలు.. ఆంధ్రప్రదేశ్, బీహార్‌లో ఉన్న సమస్యలు గురించి అడిగారు. క్షుణ్ణంగా వివరించాను.

తాతపూడి సురేష్‌బాబు, శ్రీకాకుళం

రాజంపేటపై అడిగారు?

కలలు కనడం కాదు.. వాటిని సాకారం చేసుకోవాలనే అబ్దుల్ కలామ్ మాటలు అతనిలో స్ఫూర్తి నింపాయి. బీటెక్‌లో సీనియర్స్ ఎక్కువ మంది సివిల్స్‌వైపు వెళ్లడంతో తాను ఎందుకు ప్రయత్నించకూడదు అనుకున్నారు కడపకు చెందిన శివ గణేష్ రెడ్డి. అందుకు అనుగుణంగా ప్రయత్నించి విజయం సాధించారు. తొలి రెండు ప్రయత్నాల్లో విఫలమైనా మూడో ప్రయత్నంలో ఎలా విజయం సాధించారో వివరించారు.



చెన్నంరెడ్డి శివ గణేష్ రెడ్డి 119వ ర్యాంకు

❐ కుటుంబ నేపథ్యం ఏమిటి. ఎంత వరకు చదువుకున్నారు?

జ: మధ్యతరగతి కుటుంబం మాది. సొంత ఊరు కడప పట్టణం అలంకానపల్లె. పదో తరగతి వరకు కడప, ఇంటర్మీడియట్ నెల్లూరులో, తరవాత హైదరాబాద్ ఐఐటిలో బీటెక్ పూర్తి చేశాను. ఐఐటిలో చదివే సమయంలో ఎక్కువ మంది సీనియర్లు సివిల్స్‌కు ఎంపిక అయ్యారు. దీంతో నేను ఎందుకు పరీక్ష రాయకూడదూ అనే ఆలోచన వచ్చింది. దానికి అనుగుణంగా ముందుకు సాగాను. నాన్న మల్లికార్జునరెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ ఫ్యాకల్టీగా చేశారు. ప్రస్తుతం వ్యవసాయం చూసుకుంటున్నారు. అమ్మ ఇందిరా ప్రియదర్శిని గృహిణి. చెల్లెలు శివ జ్యోతిక ప్రస్తుతం మాస్టర్స్‌కు ప్రిపేర్ అవుతోంది.

❐ ప్రస్తుతం ఏ సర్వీసు వస్తుందని అంచనా వేస్తున్నారు...?

జ: సివిల్స్‌లో నా ర్యాంకు 119. ఐఏఎస్ వస్తుందని అనుకుంటున్నాను. ఏ సర్వీసు వచ్చినా పర్వాలేదు.

❐ మీ ప్రిపరేషన్ ఎలా సాగింది. రోజుకు ఇన్ని గంటలు చదవాలన్న నియమం ఏమైనా పెట్టుకున్నారా.....?

జ: సివిల్స్‌లో విజయం సాధించాలంటే ముఖ్యంగా సామాజిక, వర్తమాన అంశాలపై దృష్టి సారించాలి. క్రమం తప్పకుండా దిన పత్రికలు చదవాలి. ప్రిలిమినరీ పరీక్షలకు సిద్ధమవుతున్న సమయంలోనే మెయిన్స్ అంశాలపై నిశిత దృష్టి సారించాలి. నా విషయానికి వస్తే రోజుకు 6 నుంచి 7 గంటల సేపు చదివాను. ఇంజినీరింగ్ పూర్తి కాగానే 2020లో కోచింగ్‌లో చేరాను. సివిల్స్‌కు సన్నద్ధమయ్యే వారికి కొన్ని పోర్టల్స్ అందుబాటులో ఉన్నాయి. మెయిన్స్‌కు ఎలా సిద్ధమవ్వాలి. అక్కడ ఏయే అంశాలపై ప్రశ్నలు వస్తాయో తెలుపుతూ ఆర్టికల్స్ ఇస్తారు. రోజుకు ఎన్ని గంటలు చదువుతున్నామన్నది కాదు ఆయా అంశాలను ఎలా ఆకళింపు చేసుకున్నామన్నదే కీలకం. క్రమశిక్షణగా ముందుకు సాగితే ఎంపికవడం సులభం.

❐ సివిల్స్‌కు కోచింగ్ తప్పనిసరిగా తీసుకోవాలా?

జ: నా దృష్టిలో కోచింగ్ ఉంటే మంచిది. ప్రిపరేషన్ త్వరలో గాడిలో పడుతుంది. నేను 2020 లో బీటెక్ పూర్తయిన వెంటనే ఢిల్లీలో కోచింగ్‌కు వెళ్లాను. కరోనా నేపథ్యంలో రెండేళ్ల గ్యాప్ వచ్చింది. తర్వాత రెండుసార్లు సివిల్స్ రాసినప్పటికీ ఫలితం రాలేదు. మూడో అటెంప్ట్‌లో జాతీయస్థాయిలో 119వ ర్యాంక్ వచ్చింది.

❐ మిమ్మల్ని ఏ బోర్డు ఇంటర్వ్యూ చేసింది?

జ: ఛైర్మన్ ప్రీతి సుగం మేడమ్ నేతృత్వంలో ఇంటర్వ్యూ అర్ధగంట సేపు సాగింది. మనం ఇచ్చే డిటెయిల్డ్ అప్లికేషన్ ఫామ్‌లో ఉన్న అంశాలపై ఇంటర్వ్యూ నిర్వహించారు.

❐ ఇంటర్వ్యూలో కఠినమైన ప్రశ్నలు లేదా ఆశ్చర్యానికి గురిచేసిన ప్రశ్నలు ఏమైనా ఉన్నాయా?

జ: కడప జిల్లాలో రాజంపేట సంబంధించి చెప్పమని ప్రశ్నించగా ఒక్కసారి ఆశ్చర్యపోయా. ఊహించని ప్రశ్న. అయినా సమాధానం చెప్పడంతో సంతృప్తి చెందారు. అలాగే కడప జిల్లాలో మహిళల సమస్యలు, వ్యవసాయ సమస్యలపై ప్రశ్నించారు వాటికి కూడా సమాధానం చెప్పడం జరిగింది.

విలియం జాన్ కళ్యాణ, ఎడ్యుకేషన్ రిపోర్టర్, కడప

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

పది కాలాల పాటు గుర్తుండే సినిమా

ప్రియదర్శి కథానాయకుడిగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో రూపొందిన 'సారంగపాణి జాతకం' చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ఆదివారం సక్సెస్ మీట్ నిర్వహించింది. మోహనకృష్ణ ఇంద్రగంటి మాట్లాడుతూ 'సారంగపాణి జాతకం' పది కాలాల పాటు గుర్తు పెట్టుకునే సినిమా. మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. కుటుంబ ప్రేక్షకులు ఇప్పుడిప్పుడే థియేటర్లకు వస్తున్నారు. మా సినిమాను సూపర్ హిట్ చేయండి' అని ప్రేక్షకులను కోరారు. నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ 'ఈ చిత్రాన్ని ఎంతో కష్టపడి, ఇష్టపడి తీశాం. ప్రతి ఒక్కరు ఈ వేసవిలో మా సినిమాను చూసి ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. 'కోర్ట్' తర్వాత 'సారంగపాణి జాతకం' ఓ వరంలా దొరికింది' అనిప్రియదర్శి అన్నారు.





అంచనాలను మించి అలరిస్తుంది

ఎస్ఎస్ రాజమౌళి

"నేను తీసే మహాభారతంలో నాని పోషించేది ఏ పాత్ర అనేది చెప్పను గానీ.. అందులో ఆయన కచ్చితంగా ఉంటాడు. నిర్మాత ప్రశాంతిని హిట్ మెషీన్ అని పిలుస్తుంటాం. 'హిట్ 3' కూడా ఆమెకు ఘనవిజయాన్ని అందిస్తుంది. ఈ 'హిట్ ఫ్రాంఛైజీకి అంతం లేదు. నాని తీసే ప్రతి సినిమాపై అంచనాలు ఎక్కువ ఉంటాయి. ఈ సినిమా అంచనాలను మించి అలరిస్తుంది. ఆయన ఇప్పటికే అందనంత ఎత్తుకు ఎదిగారు. మరింత గొప్ప స్థాయికి ఎదగాలి. ఈ సినిమాకు సూపర్‌హిట్ పక్కా అనే వైబ్ కనిపిస్తోంది" అని దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి అన్నారు. నాని, శ్రీనిధి శెట్టి జంటగా శైలేష్ కొలను తెరకెక్కించిన చిత్రం 'హిట్ 3'. మే 1న విడుదలవుతున్న సందర్భంగా ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఇందులో హింస మీరు భయపడేలా కాదు, ఎంజాయ్ చేసేలా ఉంటుంది. ఒక మంచి థ్రిల్లర్‌కు పక్కా కమర్షియల్ సినిమా జతకలిస్తే ఎలా ఉంటుందో అదే ఈ సినిమా. ఒకప్పుడు రాజమౌళిగారు నా సినిమాలు చూసి ఎలా ఉందో చెప్పేవారు. కానీ ఆ సంప్రదాయం ఈ మధ్య మిస్సయ్యింది. ఈ సినిమాను మాత్రం ఆయన మొదటి రోజు చూస్తారని ఆశిస్తున్నాను. లేదంటే ఆయన పాస్‌పోర్ట్ లాగేసుకుంటా. ఆయన పేరు ఇప్పటికే సినిమా డిక్షనరీలోకి వెళ్లిపోయింది. రోమాలు నిక్కబొడుచుకునే ఏ సన్నివేశానికైనా రిఫరెన్స్ కావాలంటే.. 'రాజమౌళి ఎపిసోడ్' అని అనడం అలవాటు అయిపోయింది. ఈ సినిమాలోనూ ఒక అద్భుత సన్నివేశం ఉంటుంది. దాన్ని నేను, శైలేష్ 'రాజమౌళి మూమెంట్' అని పిలుస్తుంటాం. విష్వక్ సేన్, అడివి శేష్ ఈ 'హిట్ యూనివర్స్'కు మూలస్తంభాలు. శైలేష్ కొలను ఎంతటి ప్రతిభావంతుడో సినిమా విడుదల రోజున మీకందరికీ తెలుస్తుంది. సినిమా బాగుండాలి. సినిమాను కాపాడుకుందాం. ఈ గురువారం మనకు సినిమా అంటే ఎంత ప్రేమ ఉందో దేశానికి చూపిద్దాం. 'హిట్ 3' మీ అంచనాలను అందుకోకుంటే 'ఎస్ఎస్ఎమ్‌బీ29'ని చూడొద్దండి. ఈ సినిమాతో పాటు విడుదలవుతున్న 'రెట్రో', 'రైడ్ 2' చిత్రాలూ బ్లాక్‌బస్టర్ అవ్వాలి" అని ఆకాంక్షించారు. "హిట్ ఫ్రాంచైజీకి నా మనసులో ఎప్పటికీ ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇదో న్యూ ఏజ్ సినిమా" అని హీరో విష్వక్ సేన్ అన్నారు. "ఈ సినిమా చివరి 30 నిమిషాలు చూశాను. చాలా బాగుంది. ఆరంభ వసూళ్లు అదిరిపోతాయి" అని అడివి శేష్ తెలిపారు. "సినిమా అంటే నానిగారికి అపారమైన ప్రేమ. నన్ను ఇంతగా నమ్మిన ఆయనకు కృతజ్ఞుడ్ని" అని దర్శకుడు శైలేష్ కొలను చెప్పారు. "నానిగారితో నటించడం ఒక మరిచిపోలేని అనుభూతి" అని హీరోయిన్ శ్రీనిధి శెట్టి తెలిపారు.

త్రీడీ వెర్షన్‌లో



చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన 'జగదేక వీరుడు అతిలోక సుందరి' చిత్రం ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. కే రాఘవేంద్రరావు దర్శకత్వంలో అశ్వనీదత్ నిర్మించిన ఈ చిత్రం 1990 మే 9న విడుదలైంది. ఈ బ్లాక్‌బస్టర్ విడుదలై 35 ఏళ్ల పూర్తవుతున్న సందర్భంగా మే 9న ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. త్రీడీ వెర్షన్‌లోనూ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.

క్రిమినల్ కథేంటి?



క్రైమ్, అపరాధపరిశోధనాత్మక కథనంతో రూపొందిన తమిళ చిత్రం 'రకాదన్'. వంశీకృష్ణ, రియాజ్‌ఖాన్, దినేశ్ ప్రధాన తారాగణం. దినేశ్ కలై దర్శకుడు. కే హైమావతి నిర్మించారు. ఇప్పుడు ఈ చిత్రం 'క్రిమినల్ 123' పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. కేజేఆర్ పిక్చర్స్ పతాకంపై రామకృష్ణ, కిశోర్, జయబాబు ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. మే తొలివారంలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మేకర్స్ ఆదివారం తెలిపారు. వాణిజ్య అంశాలకి, సామాజిక అంశాలను కలిపి తెరకెక్కించిన చిత్రమిదని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి ఏ ప్రవీణ్ కుమార్ సంగీతం అందించారు. సినిమాటోగ్రఫీ: మానస్‌బాబు.



ప్రత్యేక పాత్రలో సమంత



నటి సమంత తన సొంత బ్యానర్ ట్రా లా లా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై నిర్మించిన తొలి చిత్రం 'శుభం'. ప్రవీణ్ కండ్రేగుల దర్శకుడు. మే 9న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఆదివారం ఈ చిత్రం నుంచి మేకర్స్ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. గ్రామంలోని మహిళలంతా టీవీలో సీరియల్ చూస్తూ దెయ్యం పట్టినట్లుగా ప్రవర్తిస్తుంటారు. వారి నుంచి తప్పించుకునేందుకు పురుషులంతా అష్టకష్టాలు పడుతుంటారు. అలాంటి తరుణంలో మాతాజీగా ప్రత్యేక పాత్రలో సమంత ప్రత్యక్షమవుతారు. హాస్యం, హారర్, ఉత్కంఠ, ఎమోషన్స్ ఇలా అన్ని అంశాలను జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు ట్రైలర్‌ని చూస్తే తెలుస్తోంది.

డ్రగ్స్ కేసులో మలయాళ దర్శకుల అరెస్టు





ఇటీవలె మలయాళ నటుడు షైన్ టామ్‌చాకోను డ్రగ్స్ తీసుకుంటున్నాడన్న ఆరోపణలపై పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో.. 'నేనొక్కడినే కాదు, మలయాళ పరిశ్రమలో చాలా మంది మాదక ద్రవ్యాలు తీసుకుంటున్నారు' అని ఆయన చేసిన వాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. తాజాగా, మలయాళ పరిశ్రమకు చెందిన ఇద్దరు దర్శకులను ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. 'జింఖానా' ఫేమ్ ఖలీద్ రెహ్మాన్, 'తమాషా' ఫేమ్ అష్రఫ్ హంజాలతో పాటు వారి స్నేహితుడు షలీఫ్ మహ్మద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం ఉదయం కొచ్చిలోని ఓ అపార్టుమెంటులో సోదాలు నిర్వహించిన పోలీసులు వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత నిందితులు బెయిల్‌పై విడుదలయ్యారు. వారు ముగ్గురూ కొంతకాలంగా డ్రగ్స్ తీసుకుంటున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

గ్రామీణ ప్రేమకథ



హరికృష్ణ, భవ్యశ్రీ జంటగా గ్రామీణ ప్రేమకథ నేపథ్యంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఆదివారం షూటింగ్ మొదలైంది. ఆదినారాయణ పినిశెట్టి దర్శకత్వంలో టీఎ స్టార్ మూవీ మేకర్స్ పతాకంపై తిరుపతి శ్రీనివాసరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గతంలో ఎన్నడూ చూడని ఒక వైవిధ్యమైన ప్రేమకథను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని మేకర్స్ తెలిపారు. ప్రేమ, త్యాగం, కుటుంబ విలువల చుట్టూ తిరిగే కథతో తెరకెక్కుతోన్న చిత్రమిదని దర్శకుడు చెప్పారు. గౌతమ్ రవిరావు సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: విపిన్ వి రావు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన వ్యక్తులపై కేసు నమోదు

తెనాలి రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కొలకలూరు బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ జామ్‌కు కారణమవ్వడంతోపాటు స్కూల్ బస్సుల డ్రైవర్లపై దురుసుగా ప్రవర్తించడంపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ ఆనంద్ తెలిపారు. శనివారం సాయంత్రం కొలకలూరు గ్రామానికి చెందిన మల్లవరపు విజయ్, వున్నం రవి మరి కొంతమంది పెద్దకాలువ బ్రిడ్జ్‌పై మద్యం సేవించారు. అనంతరం ప్రధాన రహదారిపై రాకపోకలు చేసే వాహనాలను అడ్డుకుంటూ, వారితో వాగ్వాదానికి దిగి ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.


రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడుకు నివాళులర్పిస్తున్న అర్చక స్వాములు సిబ్బంది

రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడుకి ఘన నివాళి

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అమరావతి ప్రాంత పాలకుడు, జమీందార్, రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతి ఉత్సవాలు ఆదివారం పొన్నూరులలో ఘనంగా జరిగాయి. పట్టణంలోని సాక్షి భావనారాయణస్వామి ఆలయంలో ఉన్న వెంకటాద్రి నాయుడు విగ్రహానికి ఆలయ అర్చకులు సిబ్బంది భక్తులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అమరావతి ప్రాంతాన్ని పాలించిన జమీందార్ రాజావాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు సేవలను కొనియాడారు. పొన్నూరు పట్టణంలో వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ఏలుబడిలో భావనారాయణస్వామి ఆలయ అభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అన్నదాత సుఖీభవ సంఘ సభ్యులు నిర్వహిస్తున్న వేసవి చలివేంద్రంలో చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. ఆదివారం అన్నదాత సుఖీభవ సంఘ సభ్యులు మోదుగ రాధాకృష్ణమూర్తి, శ్యామలాదేవి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు, కుమార్తెలు శ్రీనివాస్, రవి, ఎం రమాదేవి, శైలజ, కుటుంబ సభ్యుల సహకారంతో పాదచారులకు చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు శ్రీనివాసరావు, ప్రతాప్, అబ్దుల్ రజాక్, వాసు, ప్రదీప్, శేఖర్ పాల్గొన్నారు.

ముస్లింలు అన్ని రంగాలలో రాణించాలి: మగ్బుల్‌బేగ్

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ముస్లిం, మైనార్టీలు అన్ని రంగాలలో ఉన్నతంగా రాణించాలని అంజుమన్ కమిటీ అధ్యక్షుడు మగ్బుల్‌బేగ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని అబ్దుల్ కలాం షాదీఖానాలో వివిధ సంఘాలకు ఎన్నికైన ముస్లింలను అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన షేక్ బాజీసాహెబ్, పొన్నూరు బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నికైన షేక్ బాజీబాబా, కోశాధికారిగా ఎన్నికైన మహ్మద్‌ఖాశీంలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ నిర్వాహకులు పట్టణ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


విజయబాబును అభినందిస్తున్న రమేష్

ఐపీఎస్‌కు ఎంపికైన విజయబాబుకు అభినందన

తెనాలి అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీస్ పరీక్షల్లో ఐపీఎస్‌కు ఎంపికైన దోనేపూడి విజయబాబును టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలుకుర్తి రమేష్ అభినందించారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో ఆదివారం విజయబాబును శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. విజయబాబు కుటుంబంలో సభ్యులంతా ఉన్నత స్థానంలో ఉన్నారని సమాజానికి ఎంతో ఆదర్శంగా నిలిచారని చెప్పారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలకు సేవ చేయాలని కోరారు.

వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

తెనాలి రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సోమవారం నుంచి జూన్ 6వరకు నిర్వహించనున్న వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని సంగంజాగర్లమూడి శాఖ గ్రంథాలయాధికారి వెంకటేశ్వరరావు అన్నారు. గ్రామంలోని శాఖ గ్రంథాలయంలో ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు జరిగే శిబిరాల్లో విద్యార్థులకు కథలు చదివించడం, వినిపించడం, అందులోని నీతిని బోధించడం, బొమ్మలు గీయించడం, వ్యాసరచనపోటీలు జరపడం, పలు రకాల ఆటల పోటీలు వంటివి ఉంటాయన్నారు. చివరిరోజు విజేతలకు బహుమతుల పంపిణీ ఉంటుందన్నారు.

● తెనాలి అర్బన్: కొత్తపేటలోని బాలల గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ అంజని కోరారు. ఈ నెల 28 నుంచి జూన్ మొదటి వారం వరకు శిక్షణ ఇస్తామన్నారు.

మూడు పంచాయతీలలో పన్నుల సొమ్ము గోల్‌మాల్

● ట్రెజరీకి జమ కాని లక్షల నిధులు
● స్పందించని అధికార యంత్రాంగం


గ్రామ పంచాయతీ కార్యాలయం

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి ప్రతి ఏడాది పన్నుల రూపంలో వసూళ్లు చేసే సొమ్ము మూడు గ్రామ పంచాయతీలలో గోల్‌మాల్ అయినట్లు సమాచారం. పొన్నూరు మండల పరిధిలోని చింతలపూడి, మాచవరం, ములుకుదురు. గ్రామ పంచాయతీలకు చెందిన సుమారు రూ.10లక్షల పన్నుల సొమ్ము ట్రెజరీకి జమ కాలేదు. చింతలపూడి గ్రామ పంచాయతీ పురపాలక సంఘం విలీన ప్రతిపాదనలో భాగంగా ఎన్నిక జరగలేదు. దీంతో పంచాయతీకి పాలకవర్గం లేక మరో వైపు రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి లేకపోవడం పంచాయతీకి ఇబ్బంది తెచ్చిపెట్టింది. చింతలపూడి పంచాయతీకి ఎన్నికలు లేకపోవడం వలన ఆర్థిక సంఘం నిధులు విడుదల కాలేదు. పంచాయతీరాజ్ వ్యవస్థ రికార్డుల నుంచి వైసీపీ పాలకులు నిబంధనలకు విరుద్ధంగా చింతలపూడి గ్రామాన్ని తప్పించారు. దీంతో గత ఐదేళ్ల నుంచి చింతలపూడి గ్రామ పంచాయతీ అటు పంచాయతీరాజ్ వ్యవస్థలో కానీ, ఇటు పురపాలక సంఘంలోని కానీ లేక పోవడం వలన అభివృద్ధి నిలిచిపోయింది. వైసీపీ పాలకులు అనాలోచిత నిర్ణయం కారణంగా ఐదేళ్లుగా గ్రామం కేవలం ప్రజలు చెల్లించిన పన్నులపైనే ఆధారపడి మనుగడ సాధించే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ప్రజలు చెల్లించిన పన్నులు కూడా పెద్ద ఎత్తున గోల్‌మాల్ కావడంతో గ్రామంలో పారిశుధ్యం తాగునీటి పైప్‌లైన్‌ల మరమ్మతులు వంటి చిన్న చిన్న అవసరాలు కూడా రోజుల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

ట్రెజరీకి జమ కాని రూ.10 లక్షలు

ఈ ఆర్థిక సంవత్సరంలో చింతలపూడి, మాచవరం, ములుకుదురు గ్రామాలకు సంబంధించి ప్రజల నుంచి వసూలైన ఇంటి, నీటి పన్నులు ట్రెజరీకి జమ కాలేదని ఆరోపణలు ఉన్నాయి. చింతలపూడి గ్రామ పంచాయతీలో ఈ ఆర్థిక సంవత్సరంలో 10.30 లక్షలు పన్నుల డిమాండ్ ఉండగా గతంలో రూ.2.50 బకాయిలు వసూళ్లు కావాల్సి ఉంది. ఈ నిధులతోనే గ్రామంలో చిన్న చిన్న అవసరాలను అధికారులు తీరుస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు రూ.6 లక్షలకు పైగా పన్నులు వసూళ్లు కాగా రూ.3.66 లక్షలు ట్రెజరీకి జమ చేయలేదని ఆరోపణలు ఉన్నాయి. మాచవరంలో రూ.2.50 లక్షలు, ములుకుదురులో రూ.4 లక్షల వరకు ట్రెజరీకి ప్రజల నుంచి వసూళ్ల అయిన పన్నులు జమ కాలేదు.

ఈ మూడు పంచాయతీలలో పనిచేసిన కార్యదర్శి గత నెల రోజులగా శెలవుపై వెళ్లడం ప్రస్తుతం ఇన్‌చార్జిలుగా ఉన్న కార్యదర్శులకు నెల రోజులుగా చార్జి అప్పగించకుండా కాలయాపన చేస్తుండడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. చింతలపూడి పంచాయతీకి ప్రత్యేక అధికారిగా ఉన్న ఎంపీడీవో చంద్రశేఖర్ రావు చింతలపూడి పంచాయతీ వైపు కన్నెత్తి చూడకపోవడంపై కూడా ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల బాధ్యతారాహిత్యం కారణంగానే ప్రజల సొమ్ము పక్కదారి పట్టిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అయితే ప్రజల సొమ్ము పక్కదారి పట్టిన సమాచారం తెలుసుకున్న జిల్లా ఉన్నతాధికారులు సదరు ఉద్యోగిని ప్రశ్నించడంతో పంచాయతీలో వసూలైన పన్నుల ఆ పంచాయతీలలో వివిధ రకాల పనులకు వినియోగించినట్లు చెప్పినట్లు తెలిసింది. సమగ్ర విచారణ జరిపితే కానీ ఈ పన్నుల గోల్‌మాల్ వ్యవహారం బయటకురాదని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. దీనిపై ఈవోపీఆర్డీ మల్లికార్జునరావును వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శి శెలవుపై వెళ్లినట్లు చెప్పారు. శెలవుపై వెళ్లిన ఉద్యోగి చార్జి అప్పగిస్తే పన్నుల వివరాలు తెలుస్తాయన్నారు. ప్రజల ఆరోపణలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు విచారణ నిర్వహించినన్నట్లు ఈవోపీఆర్డీ తెలిపారు.



కొల్లిపరలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

ఉగ్రవాదుల దాడిపై నిరసన

కొల్లిపర, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కాశ్మీర్ పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. కొవ్వొత్తులతో ర్యాలీని కొల్లిపర శివాలయం దగ్గర నుంచి వేమనమఠం వరకు కొనసాగించారు. దాడికి పాల్పడిన ముష్కరులను కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు. విశ్వహిందూ పరిషత్ గుంటూరు విభాగ కార్యదర్శి వంగా జనార్ధనరెడ్డి మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీకగా ఉంటున్న భారతదేశంలో ఉగ్రవాదుల దాడులతో భారతీయుల రక్తం మరుగుతోందన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి వెంకటప్పారెడ్డి, భారతీయ కిసాన్ సంఘ్ కార్యవర్గ సభ్యుడు వంగా సాంబిరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు మండ్రు మురళి, కొల్లి రఘురామిరెడ్డి, అవుతు వేమారెడ్డి, ఉదయభాస్కరరెడ్డి, నారాయణ పాల్గొన్నారు.


ధర్మారావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న వీరవల్లి మురళి, తదితరులు

కరణం ధర్మారావుకు ఘన నివాళి

తెనాలిరూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కఠెవరంలో హెచ్‌సీపీ అధినేత, టీడీపీ సీనియర్ నాయకులు కరణం వెంకటేశ్వరరావు తండ్రి దివంగత ధర్మారావు సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు వీరవల్లి మురళి మాట్లాడుతూ ధర్మారావు రైతుకుటుంబంలో పుట్టి ఎన్నో కష్టనష్టాలను చవిచూసినా కుమారులను మంచి విద్యావంతులుగా తీర్చిదిద్దటంతో పాటు సమాజంలో పేదలకు సాయం అందించే సేవాతత్పరులుగా పెంచారన్నారు. పెద్ద కుమారుడు కరణం వెంకటేశ్వరరావు తెలుగుదేశం పార్టీలో ఎటువంటి పదవులు ఆశించకుండా పార్టీ బలోపేతానికి ముందుకు సాగుతున్నారని తెలిపారు. కుటుంబానికి ప్రగాఢసానుభూతిని తెలిపి, తామంతా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఘట్టమనేని రామకృష్ణ, డాక్టర్ నన్నపనేని ప్రతాప్, గణేష్ యూత్ సభ్యులు బొద్దులూరి వేణు, సాయిగిరి, చుక్కపల్లి బ్రదర్స్ పెద్దసంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడికి శస్త్రచికిత్స

● మానవత్వం చాటుకుంటున్న జిల్లా వైద్యశాల వైద్యులు


ప్రభుత్వ వైద్యశాలలో కోలుకుంటున్న వృద్ధుడు, శస్త్ర చికిత్స చేసి అమర్చిన రాడ్లు

తెనాలిరూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఊరు తెలియదు.. పేరు చెప్పలేని పరిస్థితి.. నడవలేని నిస్సహాయ స్థితి చావుబతుకులమధ్య అపస్మారక స్థితిలో ఉన్న సుమారు 70ఏళ్ల పైబడిన వృద్ధుడి దీన స్థితికి చలించిన తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల బృందం తక్షణ వైద్యం అందించి వృద్ధుడిని కాపాడారు. వివరాల్లోకి వెళితే ఈ నెల 21న తెనాలిలో రోడ్డుపక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్న వృద్ధుడిని 108 ద్వారా అత్యవసర వైద్యసేవలకు తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువచ్చారు. ఓపీ నమోదుకు సైతం అతని వివరాలు లేవు. సహాయకులు కూడా లేకపోవడం వృద్ధుడు అపస్మారక స్థితిలో ఉండటంతో వైద్యులు మానవత్వం చాటారు. అవేమి లేకున్నా తక్షణమే వృద్ధుడిని వైద్యశాలలో చేర్చుకుని పరీక్షలు జరిపారు. అతడి కాలికి ఫ్యాక్చర్ అయినట్లు ఎక్స్‌రేలో వెల్లడైంది. దీంతో 23న అతడికి వైద్యశాల సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి సూచలమేరకు ఆర్థో విభాగం వైద్యులు శస్త్రచికిత్స చేసి కాళ్లకు రాడ్లు అమర్చారు. ప్రస్తుతం రోగి కోలుకుంటున్నాడు. వైద్యశాల ఆరోగ్యశ్రీ వార్డులో వైద్య సిబ్బందే అతడికి ఆహారం అందిస్తూ సపర్యలు చేస్తున్నారు. వృద్ధుడిని గుర్తిస్తే కుటుంబసభ్యులు, బంధువులు వచ్చి అతడిని తీసుకువెళ్లవచ్చని వైద్యశాల వర్గాలు తెలిపాయి.

సీనియర్ సిటిజన్ల సమావేశం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక కవిరాజా పార్కులో ఆదివారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ప్రవచనకర్త నోరి నారాయణమూర్తి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. మహాభారతం - అర్జునుడు అనే అంశంపై ప్రసంగించారు. అసోసియేషన్ సభ్యులు ఆయనను సత్కరించారు. అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ, కార్యదర్శి ప్రసాద్, పూర్ణచంద్రరావు, ఆదినారాయణ, రామ్మూర్తి, కోటిరెడ్డి, చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మారీసుపేట చంద్రబాబు కాలనీ శివారు ప్రాంతంలో జూదం ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో పేకాట ఆడుతున్న ఏడుగురు యువకులను అరెస్టు చేసి వారి నుంచి రూ.నాలుగు వేల ఒక వంద రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

30న ప్లాటినం జూబ్లీ భవనం ప్రారంభం

● పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ప్రతాపరెడ్డి

పెదకాకాని, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నంబూరు పోలయ వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ప్లాటినం జూబ్లీ భవనం ఈ నెల 30వ తేదీన ప్రారంభోత్సవం జరుగుతుందని సంఘం అధ్యక్షుడు ఈమని ప్రతాపరెడ్డి తెలిపారు. ఆదివారం పాఠశాల ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021 నాటికి పాఠశాల ప్రారంభించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 2022 సంవత్సరం మార్చిలో ప్లాటినం జూబ్లీ వేడుకలు, పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. దాతల సహకారంతో సుమారు రూ.50లక్షల వ్యయంతో భవనం నిర్మించినట్లు పేర్కొన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి నంబూరు నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రారంభోత్సవంలో జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టీనా పాల్గొంటారని తెలిపారు. సంఘ గౌరవ అధ్యక్షుడు వాసా మాణిక్యాలరావు మాట్లాడుతూ తాము చదువుకున్న స్కూలుకు తిరిగి ఏమైనా ఇవ్వాలనే తపన ప్లాటినం భవనం నిర్మించామన్నారు. సంఘ కోశాధికారి డాక్టర్ కుర్రా మురళీమోహనకృష్ణ మాట్లాడుతూ మార్చి, 1997లో స్వర్ణోత్సవాలు నిర్వహించి స్వర్ణోత్సవ భవనం నిర్మించిన పూర్వ విద్యార్థులే మాకు ఆదర్శం అన్నారు. అనంతరం ప్రారంభోత్సవం ఆహ్వాన పత్రికలను సంఘ సభ్యులు ఆవిష్కరించారు. సమావేశంలో స్కూల్ హెచ్‌ఎం కొండయ్య, సలహా కమిటీ సభ్యులు నంబూరు కిషోర్, దినేష్ రెడ్డి, రాజమన్నర్, తులాబందుల తాతయ్య, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ లంకపల్లి నాగరాజు పాల్గొన్నారు.

వైద్యులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

● ఐఎంఏ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ దగ్గుమాటి

తెనాలి అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మారుతున్న పరిజ్ఞానానికి అనుగుణంగా వైద్యులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని ఐఎంఏ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు పేర్కొన్నారు. బోసురోడ్డులోని ఐఎంఏ హాలులో ఆదివారం జరిగిన వైద్య విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైద్య రంగంలో నిష్ణాతులందరిని పిలిపించి ఎప్పటికప్పుడు వైద్య రంగంలో వస్తున్న మార్పుల పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పలు అంశాలపై ఆయన సుదీర్ఘ ప్రసంగం చేశారు. పెహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మృతులకు నివాళులర్పించారు. వైద్యులు హనుమ నాయక్, అనీల్‌కుమార్, పావని ప్రియాంక, మధుప్రభాకర్, సుమన్, యశ్వంత్, మహతి, ఫణి, రాము, చందు సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ శ్రీహరిరావును వైద్యులు సత్కరించారు.

కొరవడిన ఆధునిక పరిజ్ఞానం

● నాణ్యత లోపంతో నష్టాల్లో పసుపు రైతులు

కొల్లిపర, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నాణ్యతలో లోపాల వల్లే దుగ్గిరాల మార్కెట్ యార్డుకు వచ్చే పసుపునకు ఇతర మార్కెట్‌లకు వచ్చే పసుపు కంటే తక్కువ ధర పలుకుతోందని పలువురు పేర్కొంటనటంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. గడచిన 65 ఏళ్ళలో ఇనుప పాత్రలలో నీరుపోసి నీటిలో పసుపు వేసి ఉడకబెట్టే పద్ధతినే వినియోగిస్తున్నారు. తమిళనాడులోని సేలం, కేరళలో ఆధునిక ఆవిరి యంత్రాల ద్వారా పసుపు వండి ఎండ బెట్టి యంత్రాలతో పొలాల్లోనే పాలిష్ చేసి యార్డుకు తీసుకువచ్చి మంచి ధరను పొందుతున్నారు. అయితే ఇక్కడ మార్కెట్ శాఖ, ఉద్యానవనశాఖ అధికారులు యంత్రాల గురించి రైతులను చైతన్య పరచడం చేయటం లేదు. కొంతమంది రైతులు పసుపును ఉడకబెట్టే యంత్రాలు తీసుకొచ్చినప్పటికి వారికి కనీసం సబ్సిడీపై అందించి ప్రోత్సహించాలనే యోచన కూడా చేయకపోవడం దురదృష్టకరం. ఆధునిక యంత్రాలు అందుబాటులో ఉన్నప్పటికి యంత్రాల ఖరీదు లక్షల్లో ఉండటంతో వాటిని కొనుగోలు చేయాలంటేనే రైతులు భయపడుతున్నారు. దీంతో రైతులు అనాదిగా వస్తున్న పద్ధతులపైనే ఆదారపడుతున్నారు. అనాదిగా వస్తున్న పద్ధతులను పాటించడం కారణంగా నలుపు రంగుకు మారటం, కంటికి ఇంపుగా కనిపించకపోవడం, ఇనుప పాత్రల్లో ఉడికించినపుడు అంతా ఒకే మోతాదులో ఉడకక పోవడం కారణంగా కొమ్ములో పసుపుదనంలో వ్యత్యాసం కనిపిస్తోంది. దీంతో వివిధ రంగాల్లో దుగ్గిరాల మార్కెట్ యార్డుకు వచ్చే పసుపును తక్కువగా వినియోగిస్తున్నారు. తద్వారా వ్యాపారులు ధరల్లో తీవ్రకోతను విధించి కొనుగోళ్ళు చేస్తున్నారు. రాష్ట్రంలోనే అతి పెద్ద మార్కెట్ యార్డుగా ఉన్న నిజామాబాద్ యార్డుతో పోల్చితే క్వింటాళ్ళకు కనీసం రూ.1700 వ్యత్యాసం ఉంటోంది. తద్వారా ఒక్కో రైతు 20 నుంచి 25వేల రూపాయల ఆదాయాన్ని నష్టపోవాల్సి వస్తోంది. ఎకరానికి 2లక్షల రూపాయల వరకు ఖర్చవుతుండగా తగ్గిన దిగుబడికి తోడు యంత్ర పరిజ్ఞానం లేకపోవడంతో నాణ్యతాలోపాలను అధిగమించలేక పోతున్నామని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఆధునిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చి పసుపు రైతులకు సబ్సిడీపై ఇచ్చి ఆదుకోవాల్సి ఉంది.


పసుపును ఇనుప బానల్లో ఉడకబెడుతున్న రైతు కూలీలు

రోగులకు మెనూ ప్రకారం ఆహారం అందించండి

● వైద్యశాల సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి

తెనాలిరూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు మెనూ ప్రకారం ప్రతిరోజు రోగులకు శుచి, రుచితో నాణ్యమైన ఆహారం అందించాలని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి అన్నారు. ఆదివారం జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో నూతనంగా డైట్ కాంట్రాక్టు పొందిన శ్రీవెంకటేశ్వర అసోసియేషన్‌కు రోగులకు ఆహారం పంపిణీ చేసే బాధ్యతలను సూపరింటెండెంట్ అప్పగించారు. తొలి రోజు ఆసుపత్రి సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి చేతులమీదుగా రోగులకు ఆహారం పంపిణీ చేశారు. మూడు సంవత్సరాల కాలపరిమితికి డైట్ క్రాంటాక్టర్‌నుఉ నియమించినట్లు సూపరింటెండెంట్ పేర్కొన్నారు. ప్రభుత్వం పెంచిన నూతన ధరల ప్రకారం బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. సమయపాలనతో రోగులకు మంచి ఆహారం అందేలా బాధ్యతగా మెలగాలని నూతన కాంట్రాక్టర్‌కు సూచించారు. కాంట్రాక్టర్ రవికుమార్, డీఎస్ నాయుడులు మాట్లాడుతూ ఒంగోలు, సికింద్రాబాద్ వంటి పలు ఆసుపత్రులలో రోగులకు ఆహారం అందించే కాంట్రాక్టుచేసిన అనుభవం ఉందన్నారు. తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఎక్కడా కూడా రోగులకు ఇబ్బందులు కలుగకుండా ఆహారం అందించడం జరుగుతుందన్నారు. చిన్న చిన్న సమస్యలు వస్తే డైట్ సిబ్బందికి తెలిపితే తక్షణమే పరిష్కరించకుంటూ మంచి సర్వీస్ అందిస్తామని చెప్పారు. ఆర్‌ఎంవో మల్లికార్జునరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.రాజేశ్వరి, హెడ్ నర్సులు, కె. పద్మావతి, ఎన్.సుజాత పలువురు వైద్య సిబ్బంది, కాంట్రాక్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రోగులను పరీక్షించి సూచనలు చేస్తున్న డాక్టర్ శారద

షుగర్ వ్యాధిగ్రస్థులకు వైద్య శిబిరం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): బుర్రిపాలెం రోడ్డులోని శారద సర్వీస్ సొసైటీ భవనంలో షుగర్ వ్యాధిగ్రస్థులకు వైద్య శిబిరం నిర్వహించారు. సొసైటీ నిర్వాహకులు డాక్టర్ శారద ఆదివారం రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి ఉదయాన్నే చేరుకున్న రోగులకు అల్పాహారం కూడా అందించారు. షుగర్, బీపీ, ఈసీజీ, థైరాయిడ్ పరీక్షలు చేశారు. షుగర్ వ్యాధి రావడానికి కారణాలు, నియంత్రణ మార్గాలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలు డాక్టర్ శారద వారికి వివరించారు. సొసైటీ వలంటీర్లు సేవలు అందించారు.



గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు


50 ఏళ్ల తరువాత అపూర్వ కలయిక

తెనాలి అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేటలోని మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులు 50 సంవత్సరాల తరువాత కలుసుకున్నారు. 1974-75లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే స్కూల్‌లో సమావేశమయ్యారు. విద్యార్థి దశలో చదువుకున్న పాఠశాలను చూసి భావోద్వేగానికి గురయ్యారు. ఒకరినొకరు పరిచయం చేసుకుని నాటి మధుర జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకున్నారు. స్నేహితులంతా ఉద్యోగాలు, వ్యాపారాలు, లాయర్లు, డాక్టర్లు, స్థిరపడ్డామని చెప్పుకున్నారు. నాటి గురువులు పిచ్చయ్య, రూతు, పిచ్చేశ్వరమ్మలను ఘనంగా సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలో ఆనందంగా గడిపారు. తాడిబోయిన హరిప్రసాద్, సాయిబాబు, మల్లిఖార్జునరావు, మధు, రాంప్రసాద్, హేమచంద్ర ప్రసాద్, హెచ్‌ఎం మౌలాబీ, కృష్ణసాయిబాబు, మల్లేశ్వరరావు, శంకరబాబు, కిషోర్ తదితరులు పర్యవేక్షించారు.


33ఏళ్ల తరువాత ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

33 సంవత్సరాల తర్వాత...

తెనాలిరూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదరావూరు హైస్కూల్‌లో 1991-92 పదో తరగతి బ్యాచ్ ఆత్మీయ సమేళనం సందడిగా నిర్వహించారు. 33ఏళ్ల తరువాత ఆనాడు విద్యార్థులుగా చదువుకున్న స్కూల్‌ను చూసి అప్పట్లో చేసిన అల్లర్లను ఆటలను నెమరువేసుకున్నారు. తోటి మిత్రులతో కలిసి ఆ నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి గొప్ప స్థాయిలో నిలబెట్టిన స్కూల్‌కు ఏదో ఒకటి చేయాలన్న సంకల్పంతో శిథిలావస్థకు చేరిన తరగతి గదిని రూ.1,25,000లతో తీర్చిదిద్ది ప్రారంభించారు. అప్పటి గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. వాలేశ్వరరావు, విజయలక్ష్మి, నరసింహారావు, చలపతిరావు, వసుంధర, సత్తార్ పర్యవేక్షణలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పెద్దసంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


రాహు కేతు పూజలో పాల్గొన్న భక్తులు

మల్లేశ్వరస్వామి ఆలయంలో రాహు కేతు పూజలు

● పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

పెదకాకాని, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానం లోని రాహుకేతు గ్రహాలకు ప్రత్యేక పూజలు జరిగాయి. అమావాస్య ఆదివారం సందర్భంగా ఆలయంలో రాహు కేతు పూజలు భక్తులు అధిక సంఖ్యలో జరిపించుకున్నారు. తెల్లవారుజామున 4.30 నుంచి సాయంత్రం రాహుకాల సమయం గం.4:30 వరకు 1509 టికెట్లు భక్తులకు విక్రయించినట్లు ఆలయ ఉపకమిషనర్, కార్యనిర్వహణాధికారి గోగినేని లీలా కుమార్ తెలిపారు. రాహు కేతు పూజల ద్వారా ఆదివారం రూ. 7,54,500/-లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యం లేకుండా దేవస్థాన అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రాహు కేతు పూజలు ఇతర సేవలు కలిపి రూ.9,10,000/-లు ఆదాయం వచ్చినట్లు ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ తెలిపారు.

నేడు వీఐటీ ఏపీ విశ్వవిద్యాలయానికి సీఎం చంద్రబాబు రాక

తుళ్లూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ఐనవోలు రెవెన్యూలో గల వీఐటీ(వేలూరు ఇనిస్ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) ఏపీ విశ్వవిద్యాలయానికి సోమవారం సీఎం చంద్రబాబు రానున్నారు. ఉదయం10 గంటలకు వి-లాంచ్‌పాడ్ 2025 (గ్లోబల్ ఇన్నోవేటర్స్ ఛాలెంజ్), మహాత్మాగాంధీబ్లాక్, వి.వి.గిరి బ్లాక్, దుర్గాభాయి దేశముఖ్ బ్లాక్ నూతన భవనాల ప్రారంభోత్స కార్యక్రమంలో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొంటారని వీఐటీ యాజమాన్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పాల్గొంటారని పేర్కొంది.

320 మందికి కంటి పరీక్షలు

పెదనందిపాడు, ఏప్రిల్, 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉప్పలపాడులో రోటరీ క్లబ్ పెదనందిపాడు ఆధ్వర్యంలో అరపల్లి వీరరాఘవయ్య జ్ఞాపకార్థం భార్య సత్యవతి, కుమారుడు రాంబాబుల సౌజన్యంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం 27వ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ షవాంగి 320మందికి కంటి పరీక్షలు నిర్వహించి 155మందికి శుక్లాలు ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఈ వైద్యశిబిరాన్ని పారిశ్రామికవేత్త అరపల్లి రాంబాబు ప్రారంభించారు. రోటరీ అధ్యక్ష కార్యదర్శులు నల్లపునేని శివప్రసాద్, సభ్యులు గూడూరు వీరయ్యచౌదరి, పోపూరి లక్ష్మీనారాయణ, పోపూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

300 మందికి వైద్యసేవలు

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అమరావతి ఐకాన్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఐకాన్ క్లబ్ హౌస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మెగా వైద్యశిబిరంలో 300మంది ఉచిత వైద్యసేవలు పొందారు. నిర్వాహకులు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు డాక్టర్ విజయ, శ్రీనివాస్, రవికుమార్, ఐకాన్ ప్రెసిడెంట్ ఎం.వినోద్‌కుమార్, సెక్రటరీ ఎస్కే రియాజ్‌బాషా, రాజశేఖర్, విక్రం, ప్రకాష్, రమేష్ స్వాములు, లక్ష్మి, వెంకటరత్నం, ఐకాన్ సభ్యులు పాల్గొన్నారు.

జనసేన రక్తదాన శిబిరం

తాడేపల్లి పరిధిలోని 19వ వార్డు జనసేన అధ్యక్షుడు కాశిమాల దినేష్‌చక్రవర్తి ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా రూరల్ అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, జొన్నా రాజేష్, చవ్వాకుల కోటేష్‌బాబు పాల్గొని రక్తదానం చేసినవారికి సర్టిఫికెట్లు అందించారు. 8 ఏళ్ల వయస్సున్న భరత్‌కు తల్లిదండ్రులు లేరు. తలసేమియా వ్యాధితో బాధపడుతుండగా గత మూడేళ్లుగా జనసేన అండగా ఉండి భరత్ కోసం బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించి సంవత్సరానికి సరిపడా రక్తాన్ని చిన్నారి బాలుడికి సమకూర్చుతోంది. సుమారు 40మంది వరకు శిబిరంలో పాల్గొని భరత్ కోసం రక్తదానం చేశారు. కార్యక్రమంలో జనసేన నేతలు పాల్గొన్నారు.

ఘనంగా మల్లెపూల పూజ

పెదనందిపాడు, ఏప్రిల్, 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉప్పలపాడులో పోలేరమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అర్చకులు మహిళలతో లక్ష మల్లెల పూజా కార్యక్రమం నిర్వహించారు.

నేటి నుంచి సమ్మర్ క్యాంప్

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 6వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి షేక్ నాగుర్‌బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8నుండి 11గంటల వరకు క్యాంప్ జరుగుతుందని, ఈ క్యాంప్‌లో పిల్లలకు పుస్తక పఠనం, రాయించడం, సాంస్కృతిక కార్యక్రమాలు, స్పోకెన్ ఇంగ్లీషు, జనరల్ నాలెడ్జ్‌పై రిసోర్స్ పర్సన్ చేత శిక్షణ ఇప్పించడం జరుగుతుందని పేర్కొన్నారు.



రిచర్డ్‌కు పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

చినకాకాని బాలుడికి గిన్నిస్‌లో చోటు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం చినకాకాని గ్రామానికి చెందిన బాలుడు ఇమ్మానుయేల్‌కు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. ప్రపంచ స్థాయిలో కీబోర్డు ద్వారా క్రిస్టియన్ సంగీతాన్ని అప్‌లోడ్ చేసే ప్రక్రియలో ఈ గుర్తింపు లభించింది. ఒక గంట సమయంలో 1,046 వీడియోలను సామాజిక మాధ్యమం ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేసిన బృందంలో ఇమ్మానుయేల్ కూడా ఉన్నాడు. ఈ మేరకు విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రిచర్డ్ తల్లిదండ్రులు పాస్టర్ జేజీసీ పాల్, డాక్టర్ సుజన సమక్షంలో నిర్వాహకుల నుంచి సర్టిఫికెట్‌ను అందుకున్నారు. రిచర్డ్ ఆత్మకూరు నిర్మల స్కూల్‌లో చదువుతున్నాడు.



కాకుమానులో రహదారిపై ప్రవహిస్తున్న మురుగు

కాకుమానులో పారిశుధ్యం అధ్వానం

కాకుమాను, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పారిశుధ్య అధ్వానంగా తయారైంది. పంచాయతీ కార్యాలయానికి కూతవేటు దూరంలో మురుగు కాల్వల్లోని పారుదల లేక బాపట్ల పెదనందిపాడు ప్రధాన రహదారిపై మురుగు ప్రవహిస్తోంది. కానీ, పంచాయతీ అధికారులు, పారిశుధ్య కార్మికులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ప్రయాణికులు ఈ మురుగు నుంచే వెళ్లాల్సి వస్తోంది. నిత్యం రద్దీగా ఉంటే రహదారిపై మురుగు పారడం, అక్కడే బొడ్రాయి కూడా ఉండడం అక్కడి పరిసర ప్రాంత ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తోంది. ఇప్పటికైన పంచాయతీ అధికారులు స్పందించి డ్రైనేజ్‌లో పూడిక తీత పనులు ప్రారంభించి, సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

మత్స్యకారులకు మహర్దశ

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మత్స్యకారులకు మహర్ద పట్టిందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు అన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో మత్స్యకార నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 10 నెలల్లోనే మత్స్యకార కుటుంబాలలో సీఎం చంద్రబాబు వెలుగులు నింపారన్నారు. మత్స్యకారులకు వేట విరామ సమయంలో ఇచ్చే రూ.10వేల భరోసాను రూ.20వేలకు పెంచి వారికి న్యాయం చేశారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రూ.300 కోట్లు మత్స్యకారులకు ఖర్చుపెట్టామని చెప్పి మోసం చేసిందన్నారు. నియోజకవర్గంలో 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న పేద ప్రజలకు ఎప్పుడూ లేని విధంగా మంత్రి లోకేశ్ మొదటి విడతలో మూడు వేల ఇళ్లపట్టాలు బట్టలు పెట్టి ఇవ్వడం జరిగిందన్నారు. ఒక్క తాడేపల్లిలోనే 1300 ఇళ్ల పట్టాలు ఇచ్చారని చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు, మత్స్యకారులు సైకం నీలిమాదేవి, ఓలేటి రాము, కొక్కిలిగడ్డ ప్రభావతి, సుబ్బారావు, లంకే సూర్యం, సైకం సాంబయ్య, శ్యామ్ రాంబాబు, చంద్రబాబు, గాదె సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మత్స్యకారుల జీవితాలలో సీఎం చంద్రబాబునాయుడు వెలుగులు నింపారని, టీడీపీ ద్వారానే సంక్షేమ పథకాల అమలు సాధ్యమని వ్యాఖ్యానించారు.

ఉగ్రదాడిని ఖండిస్తున్నాం

దుగ్గిరాల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని కుల, మతం, రాజకీయాలకతీతంగా ముక్తకంఠంతో ఖండించాలని భారత ప్రజాస్వామ్య లౌకికరాజ్యాంగ పరిరక్షణ సమితి నాయకుడు షేక్ సుభాని అన్నారు. స్థానిక ముర్తుజా నగర్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తీవ్రవాదులను ప్రేరేపించిన పాకిస్థాన్‌కు భారత ప్రభుత్వం సరైన రీతిలో గుణపాఠం చెప్పాలన్నారు. పహల్గాం దాడికి, దేశంలోని ముస్లింలకు ఎలాంటి సంబంధం లేదని గుర్తించాలన్నారు. తీవ్రవాదులకు కులం, మతం ఉండదన్నారు. ప్రజలు అర్థం చేసుకుని, మతసామరస్యాన్ని పాటిస్తూ ఐక్యతతో వ్యవహరించాలన్నారు. సమావేశంలో షేక్ జిలాని, బాజీబాబా, ఖాజా పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు 1,316 క్యూసెక్కులు

దుగ్గిరాల,ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమడెల్టాకు విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి 1,316 క్యూసెక్కుల నీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.5 అడుగుల నీటిమట్టం ఉండగా రేపల్లె కాల్వకు 176, తూర్పు కాల్వకు 102, పశ్చిమకాల్వకు 77, నిజాంపట్నం కాల్వకు 180, కొమ్మమూరు కాల్వకు 693 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.



మండలంలోని కేఆర్ కొండూరులో పున:ప్రతిష్ఠకు సిద్ధమవుతున్న శ్రీమహంకాళీ అమ్మవారి దేవస్థానం అభివృద్ధికి గుంటూరుకు చెందిన శ్రీవసుధ కన్‌స్ట్రక్షన్స్ రూ.1,00,116లను విరాళంగా అందించినట్లు ఆలయ కార్య నిర్వాహక కార్యదర్శి కోగంటి సునీల్ ఆదివారం తెలిపారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం దాతలకు శ్రీమహంకాళీ అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

- (దుగ్గిరాల, ఆంధ్రజ్యోతి)

పేరేచర్లలో గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్య

మేడికొండూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరేచర్ల గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. బండరాయితో తల, ముఖంపై కొట్టి హతమార్చారు. పేరేచర్ల సమీపంలోని నరసరావుపేట రోడ్డు రైల్వేబ్రిడ్జి పక్కన పొలాల్లో ఆదివారం మృతదేహం పడి ఉండగా అందిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉండవచ్చునని పోలీసులు తెలిపారు. క్లూస్ టీం బృందం అక్కడికి చేరుకొని పరిసరాలను పరిశీలించింది. మేడికొండూరు సీఐ నాగూర్ మీరా సాహెబ్ కథనం ప్రకారం మృతదేహంపై కేవలం డ్రాయర్ మాత్రమే ఉందని, లుంగీ, షర్ట్ పక్కన పడి ఉన్నాయి. జనసంచారం అంతగా ఉండని ఈ ప్రాంతానికి ఆదివారం సాయంత్రం కొందరు వ్యక్తులు వచ్చి మద్యం సేవించారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో వారిలో వారు గొడవ పడుతూ కొట్టుకున్నారని, దూరం నుంచి గమనించిన ఒక వ్యక్తి పోలీసులకు తెలిపారు. అయితే వారి గురించిన సమాచారం ఎవరూ చెప్పలేకపోతున్నారు. స్థానికులే అయి ఉండవచ్చునని, మద్యం మత్తులో గొడవ పడి కొట్టుకొని ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. షేక్ నాగూర్ మీరా సాహెబ్ దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో పాస్టర్ మృతి.. భార్యకు గాయాలు

మేడికొండూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలంలోని పాలడుగు అడ్డరోడ్డు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో పాస్టర్ మృతిచెందగా ఆయన భార్య తీవ్రంగా గాయపడింది. పోలీసుల కథనం మేరకు.. గుంటూరు నగరం నల్లకుంటకు చెందిన తమ్మిశెట్టి జక్కరయ్య (45) పాస్టర్‌గా పనిచేస్తుంటాడు. భార్య తమ్మిశెట్టి పద్మతో కలసి ద్విచక్రవాహనంపై పిడుగురాళ్ల వెళ్తుండగా.. మార్గమధ్యంలో పాలడుగు అడ్డరోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో జక్కరయ్యతోపాటు ఆయన భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ జక్కరయ్య మృతి చెందాడు. అతని భార్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దేశానికి రాజ్యాంగం అందించిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్



సమావేశంలో మాట్లాడుతున్న గోళ్ల అరుణ్‌కుమార్

పెదనందిపాడు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని ఉప్పలపాడులో నవోదయ ఎడ్యుకేషనల్ హెల్త్ సొసైటీ సభ్యులు, సంఘస్తులు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ఆదివారం రాత్రి నిర్వహించారు. విగ్రహాన్ని ఏపీ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దుంగా రత్నప్రదీప్ ఆవిష్కరించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ సామాజిక న్యాయం, సమానత్వం, కులరహిత సమాజాన్ని నిర్మించినప్పుడు అంబేడ్కర్‌కు నిజమైన నివాళులర్పించినట్లన్నారు. డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ఏప్రిల్ 14ను ఇంటర్నేషనల్ నాలెడ్జ్ డేగా ప్రకటించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో గొట్టిముక్కల లాజర్, ఎస్ఐ అద్దంకి మధుపవన్, ఉపసర్పంచ్ నాగిశెట్టి సుబ్బారావు, విశ్రాంత ఏఎస్ఐ కొప్పుల మోహనరావు పాల్గొన్నారు.

వైభవంగా అద్దంకమ్మ సిడిమానోత్సవం

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అద్దంకమ్మవారి తిరునాళ్లలో ప్రధాన ఘట్టమైన సిడి మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. సాయంత్రం మంగళ వాయిద్యాలు, కనక తప్పెట్లతో మాతంగి కన్యతో దేవాలయం నుంచి గ్రామంలోని దాత మొక్కుబడిగా అందజేసిన సిరిపోతును అమ్మవారి ఆలయానికి చేరుకొని ప్రదర్శన నిర్వహించారు. గ్రామస్తులు అడుగడుగునా భక్తిశ్రద్ధలతో సిడిమానుకు వార్లు పోస్తూ మొక్కుబడులు తీర్చుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సీఐ రమానాయక్ ఆధ్వర్యంలో వివిధ స్టేషన్ల సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



లక్ష గాజులతో అలంకరించిన అద్దంకమ్మవారి మూల విరాట్

అమ్మవార్లకు లక్ష మల్లెల పూజ

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతవరప్పాడు గ్రామంలో కొలువైన పోలేరమ్మ, అద్దంకమ్మ అమ్మవార్ల తిరునాళ్ల మహోత్సవంలో ఆదివారం ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు ఏర్పాటు చేసిన లక్ష మల్లెపూల పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. పూజారి కృష్ణ పూజా క్రతువులు నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మే 20న కార్మిక సమ్మెను జయప్రదం చేయండి

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా మే 20న జరిగే సార్వత్రిక కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని అఖిల పక్ష ట్రేడ్ యూనియన్లు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐఎఫ్‌టీయూ (న్యూ) ఐఎన్‌టీయూసీ, వైఎస్సార్ టీయూసీ, ఐఎఫ్‌టీయూ నిర్ణయించాయి. బ్రహ్మానందపురంలోని కేసీ వర్స్క్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం సీఐటీయూ నేత బూరగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన అఖిల పక్ష సమావేశంలో పలువురు నేతలు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను బీజేపీ ప్రభుత్వం కాలరాసిందన్నారు. 20న జరిగే సమ్మెలో కార్మిక వర్గం మొత్తం పాల్గొని జయప్రదం చేయాలన్నారు. మే 3వ తేదీ కంపెనీల మేనేజర్లకు సమ్మె నోటీసులు అందజేయాలని, 9న సదస్సు నిర్వహించాలని, 20న సమ్మె జయప్రదం చేయాలని తీర్మానించారు. ఆయా యూనియన్ల నేతలు వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వర్లు, కె స్టీవెన్, టి వెంకటయ్య, కె ఆదినారాయణ, దర్శనపు శామ్యూల్, ఎం.చెన్నయ్య, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్టులు అందజేత

తాడేపల్లి (ఉండవల్లి), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లిలో నిర్వహిస్తున్న సూపర్ లీగ్ టోర్నమెంట్‌లో రాజేష్ జొన్నా సీసీ టీమ్ జెర్సీలను ఆదివారం మండల జనసేన అధ్యక్షుడు సామల నాగేశ్వరరావు, జొన్నా రాజేష్, చవ్వాకుల కోటేష్‌బాబు ఆవిష్కరించి క్రీడాకారులకు అందజేశారు. జొన్నా రాజేష్ సీసీ టీమ్ కెప్టెన్ గోపినాథ్ మాట్లాడుతు గతంలో జొన్నా రాజేష్ నిర్వహించిన సూపర్ లీగ్‌లో విన్నర్‌గా నిలిచి రూ.40వేలు ప్రైజ్ మనీ అందుకున్నామని ప్రస్తుతం తమ టీమ్ సెమీస్‌కు చేరిందని చెప్పారు. జనసేన నేతలు సామల నాగేశ్వరరావు, జొన్నా రాజేష్, చవ్వాకుల కోటేష్‌బాబు, సీర్ల లాల్‌చంద్, జీలగ కళ్యాణ్, విజయ, పసుపులేటి నరేష్ పాల్గొన్నారు.



కేసన శంకరరావును విజయవాడలో అడ్డుకున్న పోలీసులు

బీసీల ర్యాలీని అడ్డుకోవడం అప్రజాస్వామికం

● కేసన శంకరరావు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కులగణన జరిపించాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో ఆదివారం బీసీలు తలపెట్టిన ర్యాలీని అడ్డుకోవడం అప్రజాస్వామికమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయం ద్వారా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కులగణన చేయాలని కోరుతూ విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం నుంచి తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించి పది రోజుల ముందే అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నామని తెలిపారు. అయినప్పటికీ అనుమతి లేదంటూ శాంతియుతంగా జరిగే మహా ర్యాలీని పోలీసులు అడ్డుకుని నేతలు అరెస్టు చేశారని వాపోయారు. అరెస్టయిన వారిలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకా వెంకటేశ్వరరావు ఉన్నారు.

చర్చికి గ్రానైట్ అందించిన లోకేశ్

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినకాకానిలో నూతనంగా నిర్మిస్తున్న పునీత జోసెఫ్ చర్చికి రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ తన సొంత నిధులతో గ్రానైట్‌ను అందజేశారు. చర్చి నిర్మాణానికి గ్రానైట్ అందించాలని స్థానిక నేతల ద్వారా నిర్వాహకులు, సంఘ పెద్దలు మంత్రి లోకేశ్‌ను కోరారు. స్పందించిన ఆయన చర్చి ఫ్లోరింగ్‌కు అవసరమైన రూ.7 లక్షల విలువైన గ్రానైట్‌ను సొంత నిధులతో కొనుగోలు చేయించి ఆదివారం స్థానిక నేతల ద్వారా చర్చి నిర్వాహకులకు అందజేయించారు. చర్చి నిర్వాహకులు, సంఘ పెద్దలు మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ చిన్నప్ప రెడ్డి మాట్లాడుతూ మంత్రి లోకేశ్ ఎన్నికలకు ముందే చర్చి నిర్మాణానికి సహకారం అందిస్తానని మాట ఇచ్చారని, ఆ మాట ప్రకారమే గ్రానైట్ అందజేసి మాట నిలబెట్టుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు గుమ్మా హరిబాబు, ఉపాధ్యక్షులు పలగాని వెంకట నాగబాబు, పొన్నెకంటి సాంబశివరావు, నక్కా సాంబశివరావు, చాగర్లమూడి నరేంద్ర, ఆకురాతి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్త కృష్ణరాజేంద్రకు ఆత్మీయ సత్కారం



శాస్త్రవేత్త కృష్ణరాజేంద్ర దంపతులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

మంగళగిరి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్‌లో ఏఎంసీఏ ప్రాజెక్టు డైరెక్టరుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న శాస్త్రవేత్త నీలి కృష్ణ రాజేంద్రను ఆయన స్వస్థలం మంగళగిరిలో ఆదివారం ఘనంగా సన్మానించారు. సీకే హైస్కూల్ 1982 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు తమ సహచర విద్యార్థి అయిన కృష్ణ రాజేంద్ర శాస్త్రవేత్తగా సాధించిన అద్భుతమైన విజయానికి గాను శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామి కల్యాణ మండపంలో ఈ అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 40 ఏళ్ల కిందట తమతోపాటు చదువుకున్న కృష్ణ రాజేంద్ర ఏఎంసీఏ ప్రాజెక్టు డైరెక్టరుగా విశేషమైన సేవలు అందించడం గర్వకారణంగా వుందన్నారు. కృష్ణ రాజేంద్ర మాట్లాడుతూ ఈ సత్కారం తన జీవితంలో మరపురానిదని, తన సహచర విద్యార్థులు తన పట్ల కనబర్చిన అభిమానం ఎంతో గొప్పదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ శాసన సభ కమిటీ కార్యదర్శి కోనేరు సురేష్‌బాబు, సాహితీవేత్త బండ్ల మాధవరావు, పూర్వ విద్యార్థుల ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తాడికొండ తిరుమలరావు, రావెల శ్రీనివాసరావు, కే.సీతారామప్రసాద్, డాక్టర్ తాడిపర్తి శ్రీనివాసరావు, దామర్ల కుబేరస్వామి, వుడతా వెంకటేశ్వర్లు, వాల్మీకి శ్రీనివాసరావు, దేవుళ్ల పుల్లయ్య, దామర్ల వీరాంజనేయులు, గంగాధరరెడ్డి, గోలి శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు.



భగవద్గీత పారాయణంలో పాల్గొన్న చిన్నారులు

చిన్నారులకు భగవద్గీతపై శిక్షణ

దుగ్గిరాల, ఏప్రిల్ 27: మండల కేంద్రంలోని విమలానందస్వామి ఆశ్రమంలో భగవద్గీతపై శిక్షణ ప్రారంభించారు. గీతాపారాయణం ద్వారా చిన్నారుల్లో మానసిక వికాసాన్ని పెంపొందించడమే కాకుండా పెద్దలు, గురువులపట్ల గౌరవం, సాటివారిపట్ల ధర్మబద్ధంగా వ్యవహరించడం బాల్యం నుంచే తెలియజెప్పిన వారమవుతామని నిర్వాహకులు జంపాల కుసుమకుమారి అన్నారు. శిక్షణను సమన్వయకర్త పసుపులేటి గణేష్ పర్యవేక్షిస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మేడికొండూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పేరేచర్లలోని ఎస్‌జీవీఆర్ హైస్కూలులో 21 ఏళ్ల క్రితం పదో తరగతి పూర్తిచేసుకున్న పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం పాఠశాలలో జరిగింది. ప్రస్తుతం వృత్తిరీత్యా ఎక్కడెక్కడో స్థిరపడ్డవారు.. మళ్లీ చదువులమ్మ ఒడిచేరి నాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. అది ఎందరికో విద్యాబుద్ధులు నేర్పిన ఎయిడెడ్ ఉన్నత పాఠశాల వెలవెలబోతుండడంతో చలించిపోయారు. మేడికొండూరు మండలంలోని పేరేచర్లలో నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నడిచిన శ్రీవిద్యావనం గురుకుల రెసిడెన్షియల్(ఎస్‌జీవీఆర్) హైస్కూలు ఐదు గ్రామాల విద్యార్థులకు విద్యాదానం చేసింది. పదో తరగతిని 2003-04లో పూర్తిచేశామని వారు గుర్తుకు తెచ్చుకున్నారు. తమకు విద్య నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఆటపాటలతో హుషారుగా గడిపారు.

జనసేన మెడికల్ క్యాంప్‌నకు అనూహ్య స్పందన

తాడేపల్లి (ప్రాతూరు), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రాతూరు గ్రామం సచివాలయం వద్ద జనసేన రాష్ట్ర నేత చిల్లపల్లి శ్రీనివాసరావు స్ఫూర్తితో గ్రామ పార్టీ, రావెళ్ల కంటి ఆసుపత్రి, సిటీ క్యాన్సర్ ఆసుప్రతి సంయుక్త సహకారంతో ఆదివారం జనసేన నేత నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంప్‌కు అనూహ్య స్పందన లభించింది. క్యాంప్‌ను జనసేన రూరల్ అధ్యక్షుడు సామల నాగేశ్వరరావు ప్రారంభించారు. ప్రాతూరులో కంటి, గుండె, క్యాన్సర్ వంటి సమస్యలపై ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఐటీ రాష్ట్ర కార్యదర్శి చవ్వాకుల కోటేష్‌బాబు, జిల్లా సంయుక్త కార్యదర్శి బడే కోమలి, మండల ప్రధాన కార్యదర్శి సీర్ల లాల్‌చంద్, కార్యదర్శి మున్నా శ్రీనివాస్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



మెడికల్ క్యాంప్‌ను పర్యవేక్షిస్తున్న జనసేన నేతలు

ఆత్మకూరులో సేవా కార్యక్రమాలు

మంగళగిరి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మొసలి నాగయ్య, ప్రభావతి, మొసలి శివమ్మ స్మారకార్థం ఆదివారం ఆత్మకూరు గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత గ్రామ సెంటరులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మొసలి పకీరయ్య ప్రారంభించారు. పండల రాము అనే దివ్యాంగుడికి 25 కిలోల బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. పదవ తరగతిలో 571 మార్కులు సాధించిన గీతిక అనే బాలికకు రూ.5 వేల ప్రోత్సాహకం అందజేశారు. మొసలి లీలాకృష్ణ ఆధ్వర్యంలో విజయవాడ అనీల హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎన్.రాకేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు బీపీ, షుగర్, వివిధ రకాల జబ్బులకు వైద్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు తాటి వెంకట్రావు, కే.సుకుమార్, మోతుకూరి రవి, జనసేన గ్రామ అధ్యక్షుడు కట్టా కృష్ణ, మొసలి జ్యోతిబసు, మొసలి అశోక్ పాల్గొన్నారు.

నేషనల్ హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ అండ్ యాంటీ క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా ఏపీ సంయుక్త కార్యదర్శిగా నియమితులైన చదలవాడ సాయిచంద్‌ను సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, నేతలు కంచర్ల కాశయ్య యార్లగడ్డ వెంకటేశ్వరరావు, అన్నవరపు ప్రభాకర్ రావు తదితరులు ఆదివారం ఘనంగా సన్మానించారు.



- మంగళగిరి సిటీ

మంచికలపూడి రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలి..

దుగ్గిరాల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచికలపూడి - పెనుమూలి మధ్య రెండు నెలల క్రితం ప్రారంభమైన మంచికలపూడి రోడ్డు నిర్మాణం పూర్తికాకపోవడంతో వాహనదారులు, పరిసర గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రసిద్ధి చెందిన కంఠంరాజుకొండూరు శ్రీమహంకాళీ అమ్మవారి దేవస్థానం పున:ప్రతిష్ఠ మే 4న జరుగనున్న నేపథ్యంలో చిలువూరు వైపు నుంచి ఆలయానికి వచ్చే రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. వచ్చే నెల 1 నుంచి 4వతేదీ వరకూ ఐదురోజుల పాటు జరుగు ఉత్సవాలకు 20 నుంచి 30వేల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యామ్నాయంగా మంచికలపూడి రోడ్డు నిర్మాణం పూర్తికాకుంటే భక్తులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. తక్షణమే రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని కేఆర్ కొండూరు, మంచికలపూడి, పెనుమూలి గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



నిర్మాణం పూర్తికాని మంచికలపూడి రోడ్డు